# విశాలభారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ 10.11.2024 | 24 క్యారెట్లు 80,105.00 | కిలో వెండి 1,06,589.00 | 32 ℃ | సంపుటి:3 | సంచిక:19

www.vishalabharati.com



# మోడీ.. అబద్ధాలు ఆపు

- నిజాలు చెప్పేందుకు నేను వచ్చా
- తెలంగాణలో 6 గ్యారెంటీలు అమలు చేస్తున్నాం
- 22 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశాం
- ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం
- బీజేపీ పాలనలో మహారాష్ట్ర అధోగతి
- రైతుల ఆత్మహత్యలు ఈ రాష్ట్రంలోనే ఎక్కువ
- ముంబై లో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

2 లో



## కేటీఆర్, ఎర్రబెల్లికి ? షాక్







## అప్రూవర్‌గా మారనున్న అమోయ్‌కుమార్

- భూ కుంభకోణంలో ఈడీ దూకుడు
- "విశాల భారతి" చెప్పింది నిజం కాబోతుందా..
- డీజీపీతో భేటీ అయిన అధికారులు
- పోలీసుల సహకారంతో కేసులు, అరెస్టులకు రంగం సిద్ధం
- పలువురు మాజీ మంత్రులు, ఐఏఎస్‌ల పాత్ర ఉన్నట్లు సమాచారం!
- పొంగులేటి చెబుతున్న బాంబు ఇదేనా..?
- పొలిటికల్ వర్గాల్లో చర్చనీయాంశంగా భూ దందా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఐఏఎస్ అమోయ్‌కుమార్ వ్యవహారం రోజుకో కీలక మలుపు తిరుగుతోంది. రంగారెడ్డి జిల్లాలో భూదాన్ భూముల అక్రమ బదలాయింపులో అమోయ్ కుమార్ పై చర్యలు తీసుకోవడంతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రులు, ఐఏఎస్ అధికారులను విచారించేందుకు ఈడీ రెడీ అయింది. ఈ మేరకు ఈడీ అధికారులు శుక్రవారం నాడు డీజీపీని కలిశారు. భూ కుంభకోణాలపై వరుసగా వస్తున్న ఫిర్యాదుల గురించి డీజీపీతో చర్చించారు. భూదాన్ భూముల కేసు దర్యాప్తులో భాగంగా ఇతర భూ కుంభకోణాల గురించి ఈడీకి మొత్తం 12 ఫిర్యాదులు అందాయి. అయితే వీటన్నింటిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కోరారు. ఈడీ విచారణలో భాగంగా ఐఏఎస్‌అమోయ్ కుమార్ భూకుంభకోణాలకు సంబంధించి కీలక సమాచారం వెల్లడించినట్లు తెలుస్తోంది. మరోవైపు అమోయ్ కుమార్ కూడా ఈ వ్యవహారంలో

..మిగతా 2 లో



# ఏపీతో మళ్లీ నీళ్ల గొడవ

- సాగర్ వద్ద ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య వివాదం
- కుడికాలువ మీటర్ రీడింగ్ విషయంలో గొడవ
- తెలంగాణ అధికారులను అడ్డుకున్న ఏపీ అధికారులు

2 లో



## నన్ను చంపేందుకు కుట్ర చేస్తున్నారు

- ప్రాణం పోయినా దళితుల కోసం పోరాడుతా
- హుజూరాబాద్ లో దళితబంధు కోసం కౌశిక్ నిరసన
- అడ్డుకున్న పోలీసులు.. స్పృహకోల్పోయిన కౌశిక్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

హుజురాబాద్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దళితులకు రెండో విడత దళిత బంధు నిధులు ఇవ్వాలంటూ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన డిమాండ్ ఈ ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ క్రమంలోనే.. పాడి కౌశిక్ రెడ్డి

2 లో



## మల్లారెడ్డి ఆసుపత్రిలో ఘోరం

- ఠాగూర్ సినిమా సీన్ రిపీట్
- వైద్యుల నిర్లక్ష్యంతో యువతి మృతి
- డెడ్‌బాడీకి ట్రీట్‌మెంట్ చేశారని బంధువుల ఆందోళన
- అనాథలుగా మారిన ఇద్దరు చిన్నారులు
- ఇదేంటని ప్రశ్నించిన మీడియాపై దాడి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్‌లోని మల్లారెడ్డి హాస్పిటల్‌లో దారుణం చోటుచేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యంగా ఓ మహిళ మృతి చెందింది. అయితే ఠాగూర్ సినిమాలో మాదిరిగా డబ్బుల కోసం మృతదేహానికి ట్రీట్ మెంట్ చేశారని మృతురాలి బంధువుల

..మిగతా 2 లో

## ప్రజల సందేహాలు తీర్చాలి

- కులగణనను దేశమంతా గమనిస్తోంది
- కలెక్టర్లు ఎన్యుమరేటర్లతో విస్తృతంగా మాట్లాడాలి
- మంత్రులు, ఎమ్మెల్యేలు భాగస్వాములవ్వాలి
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి సూచన



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఇళ్ల జాబితాలు పూర్తి చేసుకుని నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో కలెక్టర్లు, ఎన్యుమరేటర్లతో విస్తృతంగా మాట్లాడాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సమగ్ర కుటుంబ సర్వేపై ఉన్నతాధికారులతో భట్టి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి,


..మిగతా 3 లో



## రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి ఎత్తేస్తాం

- బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని నాశనం చేయాలనుకుంటున్నాయి
- కాంగ్రెస్‌అగ్ర నేత రాహుల్ గాంధీ

2 లో



## ఓటేస్తే స్పెషల్ డిస్కౌంట్స్

- ముంబయి ఓటర్లకు బంపర్ ఆఫర్
- రెస్టారెంట్లు, హోటళ్లు, మల్టీప్లెక్స్‌లతో అధికారుల చర్చలు

2 లో




## విజయవాడ-హైదరాబాద్ మధ్య సీప్లేన్ సేవలు

- మొత్తం 4 రూట్లలో ప్రతిపాదనలు
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

..మిగతా 2 లో

## రేవంత్ ..నేనొస్తున్నా కాసుకో..



- పిచ్చి మాటలొద్దు.. తిట్టడం నాకూ వచ్చు
- నేను మొదలుపెడితే తట్టుకోలేవ్
- నీకు అధికారం ఇచ్చింది కూల్చేయడానికి కాదు
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే అధికారం
- కార్యకర్తలు, నాయకులు భయపడొద్దు
- 11 నెలల్లోనే కాంగ్రెస్‌సర్కారుపై వ్యతిరేకత
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఓవైపు.. మూసీ ప్రక్షాళన విషయం అధికార ప్రతిపక్షాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు, తీవ్ర ఆరోపణలు నడుస్తున్న క్రమంలోనే.. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి తన పుట్టినరోజు (నవంబర్ 08న) సందర్భంగా మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర పేరుతో పాదయాత్ర చేయటమే కాకుండా.. అదే సందర్భంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఘాటైనా వ్యాఖ్యలు చేయటం రాష్ట్ర రాజకీయాల్లో అగ్గి రాజేస్తోంది. కాగా.. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై మాజీ సీఎం,

..మిగతా 3 లో

విశాలభారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
10.11.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
2
vishalabharathi Telugu Daily

## వాష్ అండ్ గో కార్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి విశాల భారతి :** చందానగర్ డివిజన్ పరిధిలోని కెవిస్ఆర్ ఎనక్లేవ్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వాష్ అండ్ గో కార్ డిటైలింగ్ స్టూడియో ను మియాపూర్ ఏసిపి నర్సింహ రావు,సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హాజరై శనివారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నిర్వహకులు సౌజన్య,నాయకులు అన్వర్ షరీఫ్,దాత్రి నాథ్ గౌడ్,కనికి రెడ్డి,ఖాజా,రామారావు, చంద్రశేఖర్, సందీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# కేటీఆర్, ఎర్రబెల్లికి షాక్

మొదటిపేజీ తరువాయి



అప్రూవర్‌గా మారనున్నట్లు తెలుస్తోంది. ధరణిని వాడుకొని బీఆర్ఎస్‌కీలక నేతలు భూములను దోచుకున్నారని ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించిన సంగతి తెలిసిందే. అలాగే త్వరలో పొలిటికల్ బాంబ్ కూడా పేలుస్తామన్నారు. అయితే ఆ పొలిటికల్ బాంబ్ అమోయ్ కుమార్ కేసుకు సంబంధించిందేనని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌తో పాటు అమోయ్ కుమార్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న మరో మాజీ మంత్రి ఎర్రబెల్లి కూడా సవాళ్లు ఎదుర్కొనే పరిస్థితులు రావొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**అమోయ్‌తో పాటు మరికొందరు అధికారులు**

అయితే ఈడీ బృందం నేరుగా పోలీస్ ఉన్నతాధికారులను కలిసి కేసులు నమోదు చేయాలని సిఫార్సు చేయడం చాలా అరుదు. ఇప్పటిదాకా అమోయ్‌కుమార్‌పై ఎలాంటి ఎఫ్ఐఆర్ లేకపోవడం వల్ల ఈడీ దర్యాప్తునకు ఆటంకాలు ఎదురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే పోలీసులు నమోదు చేసే ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా విచారణలో ముందుకెళ్లే యోచనతో ఈడీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామం దృష్ట్యా అమోయ్‌కుమార్‌తో పాటు మరికొందరు ఉన్నతాధికారుల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. మరి ఈ కేసు వ్యవహారం ఇంకా ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తుంది ? దీనివెనుక ఉన్న పెద్ద తలకాయలు ఎవరున్నారు, కేటీఆర్, ఎర్రబెల్లితో పాటు ఇతర కీలక నేతలు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందా..? అనేదానిపై రాజకీయంగా చర్చనీయాంశమవుతోంది.

**కీలకంగా మారిన ఆ ముగ్గురి స్టేట్‌మెంట్లు..**

అమోయ్‌కుమార్‌తో పాటు మహేశ్వరం మాజీ తహ సీల్దార్ జ్యోతి, మాజీ ఆర్డీఓ వెంకటాచారి ఇచ్చిన స్టేట్ మెంట్ తో పాటు బాధితులు అందించిన డాక్యుమెంట్లు, ఇతర ఆధారాలతో ఈడీ ఎంక్వైరీ చేస్తున్నది. సంబంధిత అధికారులను విచారిస్తున్నారు. వీరి స్టేట్‌మెంట్స్, స్థానిక పోలీస్ స్టేషన్స్‌లో కేసుల ఆధారంగా పలువురు మాజీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్యూరోక్రాట్స్‌కు ఈడీ సమన్లు జారీ చేయనున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే డీజీపీ జితేందర్‌ను కలిసినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో కేసుల నమోదు, దర్యాప్తు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అవసరమైన సహకారం అందించాలని ఈడీ అధికారులు డీజీపీని కోరినట్లు తెలిసింది.

# మోడీ.. అబద్ధాలు ఆపు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలపై ప్రధాని మోదీ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. ప్రధాని మోదీ అబద్ధాలు చెబుతుంటే తాను నిజాలు ప్రచారం చేసేందుకే మహారాష్ట్ర వచ్చానని తెలిపారు. శనివారం ఆయన మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం సందర్భంగా మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు , హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏఐసీసీ జాతీయ మీడియా కమిటీ ఛైర్మన్ పవన్ ఖేరా, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

**మహారాష్ట్రలోనే ఎక్కువ రైతు ఆత్మహత్యలు**

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మహారాష్ట్ర బీజేపీ నేతలు కొద్దిరోజులుగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. అందుకే నేను మహారాష్ట్ర ప్రజలకు తెలంగాణలో ఆరు గ్యారంటీల అమలుపై నిజాలు చెప్పడానికి ఇక్కడకు వచ్చానన్నారు. దేశంలో మహారాష్ట్రలోనే ఎక్కువ రైతు ఆత్మహత్యలు జరిగాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని మరిచాయాయని విమర్శించారు. రైతుల సంక్షేం గాలికి వదిలిన ప్రధాని మోదీ రైతులకు వ్యతిరేకంగా నల్లచట్టాలు తెచ్చి అదానీ, అంబానీలకు మేలు చేయాలని భావించారని ఆరోపించారు. తమ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చామని, ఆ మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన 25 రోజుల్లో 22,22,067 మంది రైతులకు రూ.17,869 కోట్లు మాఫీ చేసినట్లు తెలిపారు. ఎవరికైనా ఈ విషయంలో అనుమానాలు ఉంటే తమ ప్రభుత్వం పూర్తి వివరాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు.

**మా సమాధానంతో మోదీ ట్వీట్ డిలీట్ చేశారు..**

తెలంగాణ రైతుల విషయంలో మోదీ విమర్శలకు తెలంగాణ ప్రభుత్వం సరైన సమాధానం ఇచ్చిందని, ఆ తర్వాతే ప్రధాని మోదీ తాను చేసిన ట్వీట్ ను తిరిగి డిలీట్ చేశారని రేవంత్ చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడిన పది నెలల్లోనే 50వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు తెలిపారు. ఆరు గ్యారంటీల్లో హామీ ఇచ్చిన మహాలక్ష్మీ పథకం ద్వారా రూ. 500లకే గ్యాస్ అందిస్తున్నామని, ఇప్పటివరకు దాదాపు 50 లక్షల మంది 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ద్వారా లబ్ది పొందుతున్నారని చెప్పారు. రైతుల పండించిన వరికి రూ.500 మద్దతు ధర అందిస్తున్నామన్నారు.

తెలంగాణలో 1 కోటి 4 లక్షల మంది మహిళలు ఈ పది నెలల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వినియోగించుకున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం రూ.3541 కోట్లు ఆర్టీసీకి ప్రభుత్వం అందించిందన్నారు. సామాజిక న్యాయం అందించేందుకు తెలంగాణలో కులగణన చేపట్టామని, 2025 జనగణనలో తెలంగాణ కులగణనను పరిగణనలోకి తీసుకోవాలని కేబినెట్ లో తీర్మానం చేసి.. ప్రధాని మోదీని డిమాండ్ చేసినట్లు రేవంత్ మీడియా సమావేశంలో చెప్పారు.



**దేశచరిత్రలో మహారాష్ట్రకు ప్రత్యేక స్థానం**

దేశ గతిని మార్చిన ఎందరో మహానుభావులకు మహారాష్ట్ర గడ్డ జన్మనిచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే, బాలగాంగధర్ తిలక్, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి ఎందరో మహానుభావులు ప్రజల్లో చైతన్యం నింపి దేశానికి ఒక దారి చూపిన నేతలంతా ఈ గడ్డపైనే పుట్టారని కొనియాడారు. ఇంతటి ఘనత ఉన్న మహారాష్ట్ర ఎవరి చేతుల్లోకో వెళ్లకూడదని దేశానికి మేలు చేసే వాళ్ల చేతుల్లోనే ఉండాలని మహారాష్ట్ర ప్రజలకు సూచించారు. మహారాష్ట్రకు రావాల్సిన 17 మెగా ప్రాజెక్టులు మోదీ గుజరాత్ కు తరిలించుకొని పోయారని, మిమ్మల్ని మోసం చేసిన బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించండని రేవంత్ మహారాష్ట్ర ఓటర్లకు పిలుపునిచ్చారు.



# నన్ను చంపేందుకు కుట్ర చేస్తున్నారు

తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయన చేతికి గాయమైంది. ఈ క్రమంలో ఆస్పత్రి బెడ్ మీది నుంచి పాడి కౌశిక్ రెడ్డి ఎమోషనల్ కామెంట్స్ చేశారు. తనను చంపినా పర్వాలేదని.. తన ప్రాణం పోయే వరకు తన దళిత సోదరుల కోసం పోరాడతానంటూ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. అయితే.. హుజూరాబాద్ నియోజక వర్గంలో రెండో విడత దళిత బంధు రాని వాళ్ల కోసం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్షకు దిగేందుకు నిర్ణయించుకున్నారు. కాగా.. రెండో విడత దళిత బంధు రాని వాళ్లు తనకు దరఖాస్తు ఇవ్వాలని పాడి కౌశిక్ రెడ్డి ఇచ్చిన పిలుపుతో చాలా మంది ఆయన నివాసానికి చేరుకున్నారు. దీంతో.. దరఖాస్తు ఇచ్చేందుకు వచ్చిన వారితో కలిసి పట్టణంలో ఉన్న అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా బయలుదేరిన కౌశిక్ రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. ఎమ్మెల్యేతో సహా పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య వాగ్వాదం చెలరేగి.. తోపులాట జరిగింది. ఈ తోపులాటలో కౌశిక్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తన చేతికి గాయమవటమే కాకుండా ఆయనకు ఛాతీలో కూడా నొప్పి వచ్చింది. దీంతో.. ఆయనను పోలీసులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చేరిన పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎమోషనల్ కామెంట్స్ చేశారు. తన చేయి విరగిపోయినా పర్వాలేదని.. తనను చంపినా పర్వాలేదని.. కానీ తన దళిత బిడ్డలకు మాత్రం దళితబంధు ఇవ్వకపోతే ఊరుకునే ప్రసక్తే లేదని పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. తెలంగాణలోని దళిత బిడ్డలకు కేసీఆర్ దళితబంధు ఇస్తే.. ఈ రేవంత్ రెడ్డి రూ.12 లక్షలు ఇస్తానని చెప్పి మోసం చేశారని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయమని అడిగితే ఈ విధంగా దాడులు చేస్తారా.. లాఠీఛార్జ్ చేస్తారా అంటూ నిప్పులు చెరిగారు. తనను హత్య చేసేందుకు కుట్ర చేశారని.. పోలీసుల కుట్రలను తన దళిత సోదరులు అడ్డుకున్నారని చెప్పుకొచ్చారు. దళిత సోదరులే తన ప్రాణాలు కాపాడారని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావు సహా నేతలంతా కౌశిక్ రెడ్డికి ఫోన్ చేసిన మాట్లాడి ధైర్యం చెప్పారు.

# ఓటేస్తే స్పెషల్ డిస్కౌంట్స్

**విశాలభారతి, నేషనల్‌బ్యూరో:**



మహారాష్ట్రలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు బృహత్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ముంబయిలో ఓటు వేసిన వారికి రెస్టారెంట్లు, హోటళ్లు, స్టోర్లు, మల్టీప్లెక్స్‌ల్లో ప్రత్యేక డిస్కౌంట్ ఇచ్చేలా చర్చలు జరిపి ఒప్పించారు. పోలింగ్ జరిగే 20వ తేదీతో పాటు మరో 2 రోజులు ఓటు వేసినట్లు వేలిపై ఉన్న సిరా చుక్క గుర్తును చూపిస్తే డిస్కౌంట్ ఆఫర్ పొందచ్చని పెద్ద పెద్ద సంస్థలు ప్రకటించాయి. ఇలాంటి డిస్కౌంట్ల వల్ల ఈసారి ఓటింగ్ శాతం పెరుగుతుందని ఎన్నికల సంఘం కూడా భావిస్తోంది.

**ఓటు వేయ్ డిస్కౌంట్ పట్టు!**

ఓటు వేయ్ డిస్కౌంట్ పట్టు ఇనిషియేటీవ్‌ను విజయవంతం చేసేందుకు అక్టోబర్ 31వ తేదీన బృహత్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ సహా ఈసీ అధికారులు రెస్టారెంట్లు, ట్రేడర్లు, మల్టీప్లెక్స్‌ల సంఘాలతో చర్చలు జరిపారు. PVR ఐనాక్స్, సినీపోలిస్, మిరేజ్, స్టెర్లింగ్, ముక్త, మూవీమ్యాక్స్, మూవీ టైమ్‌లు నవంబర్ 20, 21, 22 తేదీల్లో ఓటర్లకు 20 శాతం డిస్కౌంట్ ఇచ్చేందుకు అంగీకరించాయి. హోటళ్లు, రిటైల్ వ్యాపారుల సంఘాలు కూడా 20, 21వ తేదీల్లో 10 నుంచి 20 శాతం రాయితీ ఇస్తామని పేర్కొన్నాయి. రిలయన్స్ రిటైల్ ఔట్‌లెట్లలో కూడా 20న డిస్కౌంట్ ఆఫర్ ఉంటుందని సంస్థ ప్రకటించింది.



# మల్లారెడ్డి ఆసుపత్రిలో ఘోరం

మొదటిపేజీ తరువాయి

ఆందోళనకు దిగారు. అయితే దీన్ని కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై మల్లారెడ్డి బౌన్సర్లు దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 4వ తేదీన కిడ్నీలో రాళ్లు వచ్చాయని మాధవి అనే మహిళ మల్లారెడ్డి హాస్పిటల్‌లో చేరింది. సర్జరీ ఫెయిల్ కావడంతో ఆ మహిళ మృతి చెందిందని బంధువులు చెబుతున్నారు. అయితే డబ్బుల కోసం మృతదేహానికి ట్రీట్‌మెంట్ చేసినట్లు నటించారని ఆందోళనకు దిగారు. ఆపరేషన్ ఫెయిల్ అయిన విషయాన్ని తమకు చెప్పకుండా దాచారని.. వెంటలేటర్ పై ఉంచి ట్రీట్మెంట్ అందిస్తున్నామని నమ్మించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిని సీజ్ చేయాలంటూ బంధువుల డిమాండ్ చేస్తున్నారు. బాధిత మహిళకు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. తల్లి మృతి చెందడంతో ఆ ఇద్దరు చిన్నారులు అనాథలు అయ్యారని బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే.. ఈ విషయంపై డీహెంచ్‌వో అధికారులు, పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే మల్లారెడ్డి హాస్పిటల్ మృతురాలి బంధువుల ఆందోళనను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియాపై అక్కడే ఉన్న మల్లారెడ్డి గూండాలు దాడికి పాల్పడ్డారు. మీడియా ప్రతినిధిని చితకబాదారు. దీంతో అతను ఆసుపత్రి పాలయ్యాడు. దీనిపై మీడియా ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

# రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి ఎత్తేస్తాం

- బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని నాశనం చేయాలనుకుంటున్నాయి
- కాంగ్రెస్‌అగ్ర నేత రాహుల్ గాంధీ

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**



కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లలో ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటామని రాహుల్ గాంధీ తెలిపారు. అలాగే ఝార్ఖండ్‌లో ఇండియా కూటమి అధికారంలో వస్తే కులగణన జరిపిస్తామన్నారు. ఎస్టీ రిజర్వేషన్లను ప్రస్తుతమున్న 26 శాతం నుంచి 28 శాతానికి, ఎస్సీ రిజర్వేషన్లను 10 నుంచి 12 శాతానికి, ఓబీసీ రిజర్వేషన్లను 24 నుంచి 27 శాతానికి పెంచుతామని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని నాశనం చేయాలనుకుంటున్నాయని ఆరోపించారు. కానీ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు రాజ్యాంగాన్ని రక్షిస్తూనే ఉంటాయని తెలిపారు. ప్రేమ, ఐక్యతతో పాటు రాజ్యాంగాన్ని పరిరక్షించే ఇండియా కూటమి, ప్రజలను విభజించేవారితో యుద్ధం చేస్తోందని అన్నారు. ఝార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో బీజేపీపై రాహుల్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

**దేశానికి మహిళలే వెన్నెముక**

"జేఎంఎం నేతృత్వంలోని కూటమిని మళ్లీ ఆశీర్వదించండి. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు నిరంతరం కృషి చేస్తాయి. దేశంలో సిద్ధాంతాల మధ్య యుద్ధం జరుగుతోంది. ఒకవైపు ఇండియా కూటమి, మరోవైపు బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఉన్నాయి. ఇండియా కూటమి ప్రేమ, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తుంది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ దేశంలో హింస, కోపం, దురహంకారం, ద్వేషాన్ని పెంచుతాయి. ఝార్ఖండ్ ఎన్నికల్లో గెలిచిన వెంటనే, ఇండియా బ్లాక్ ప్రతినెలా మహిళల బ్యాంకు ఖాతాలోకి రూ.2,500 బదిలీ చేస్తుంది. బీజేపీ సర్కార్ ప్రస్తుతం బిలియనీర్లకు ఇస్తున్న డబ్బును, ఇకపై మహిళల ఖాతాల్లోకి జమ చేయాలని ఇండియా కూటమి నిర్ణయించింది. దేశానికి మహిళలే వెన్నుముక. కానీ ద్రవ్యోల్బణం కారణంగా వారే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు" అని రాహుల్ గాంధీ అన్నారు.





# విజయవాడ-హైదరాబాద్ మధ్య సీప్లేన్ సేవలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దేశంలో సీ ప్లేన్ తొలిసారిగా ఏపీ నుంచే ప్రారంభమవుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎయిర్‌పోర్టులు నిర్మించలేని మారుమూల ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాలతో కనెక్టివిటీ పెంచడానికి సీ ప్లేన్ సేవలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కొన్ని మార్గదర్శకాలు మార్చి సామాన్యులకు అందుబాటు ధరలో ఉండేట్లు స్కీంను రూపొందిస్తున్నామని చెప్పారు. మరో 3 నుంచి 4 నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. 4 రూట్లలో సీప్లేన్ ప్రయాణం ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ప్రస్తుతానికి విజయవాడశ్రీశైలంతో పాటు విజయవాడ నాగార్జునసాగర్, విజయవాడ హైద్రాబాద్ రూట్లను పరిశీలిస్తున్నామని ఆయన వివరించారు.

# ఏపీతో మళ్లీ నీళ్ల గొడవ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఏపీ, తెలంగాణ అధికారుల మధ్య నాగార్జున సాగర్ వద్ద మరోమారు వివాదం చోటుచేసుకుంది. నాగార్జునసాగర్ కుడికాలువ వాటర్ రీడింగ్ కోసం తెలంగాణ సిబ్బంది నాగార్జున సాగర్ డ్యాం వద్దకు వెళ్లారు. అయితే అక్కడ ఆంధ్రప్రదేశ్ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. మీకు ఇక్కడేం పనంటూ వారిని అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. నీటి విడుదలకు సంబంధించిన లెక్కలు చెప్పేది లేదని, రీడింగ్ తియ్యవద్దని తెలంగాణ అధికారులను అడ్డుకున్నారు. మీరు ఎవరికైనా చెప్పుకోండి అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఏపీ అధికారుల తీరుపై తెలంగాణ అధికారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఇరు రాష్ట్రాల అధికారులకు కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డు అధికారులు నచ్చజెప్పారు. గత నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా నాగార్జునసాగర్ డ్యాం పైన జల వివాదం నేపథ్యంలో ఏపీ, తెలంగాణ పోలీసులు మోహరించడంతో యుద్ధ వాతావరణం కొనసాగింది. మళ్ళీ ఇప్పుడు ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య కృష్ణా జలాలపై వివాదం చోటుచేసుకుంది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
10.11.2024
హైదరాబాద్
epaper:vishalabharathi.com
www.vishalabharati.com


## బీజేపీ అంటే మోడీ పార్టీ కాదు..

విశాలభారతి, స్టేట్ బ్యూరో:గ్రామీణ భారతాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ పట్టించుకోలేదని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ విమర్శించారు. ఆ పార్టీ తన పాలనలో పల్లెలకు ప్రాధాన్యం ఇచ్చి ఉంటే రైతుల ఆత్మహత్యలు ఉండేవి కావని, గ్రామాల్లో పేదరికం తక్కువగా ఉండేదని పేర్కొన్నారు. మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వార్ధా జిల్లాలో నిర్వహించిన ప్రచార సభలో గడ్కరీ పాల్గొని ఈమేరకు ప్రసంగించారు. బీజేపీ అంటే తనకు లేదా ప్రధాని మోదీకి చెందిన పార్టీ కాదని.. దాని కోసం తమ జీవితాలను అంకితం చేసిన కార్యకర్తలదని కేంద్ర మంత్రి గడ్కరీ వ్యాఖ్యానించారు. తన రాజకీయ ప్రయాణంలో పార్టీ కార్యకర్తల సహకారాన్ని కొనియాడిన ఆయన.. తాను కార్యకర్తగా ఉన్న రోజులను గుర్తుచేసుకున్నారు. "పార్టీ కార్యకర్తగా ఉన్న సమయంలో నేను విదర్భ ప్రాంతంలోని వార్ధా జిల్లాలో స్కూటర్‌పై తిరిగేవాడిని. దేశ చరిత్రలో.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ఎన్నడూ ప్రాధాన్యం ఇవ్వలేదు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు వంటి కనీస సౌకర్యాలూ కల్పించలేదు. ఆ పార్టీ తన పాలనలో పల్లె వికాసంపై దృష్టి సారించి ఉంటే రైతుల ఆత్మహత్యలు, పేదరికం ఉండేవి కావు" అని అన్నారు.

తాను రిజర్వేషన్లను వ్యతిరేకించనని, రాజకీయాల కోసం కులమతాల ప్రస్తావన తీసుకురానని స్పష్టం చేశారు. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారు రిజర్వేషన్లు పొందాలని.. సామాజికవర్గాలను అడ్డుగా పెట్టుకుని కాదని వ్యాఖ్యానించారు.



# ప్రతిఘటన పోరాటాలే అజేయం

▸ వి. కోటేశ్వరరావు

సూర్యాపేట, విశాల భారతి

ప్రతిఘటన పోరాట సేనాని, భారత విప్లవోద్యమ అగ్ర నాయకుడు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి నాలుగు దశాబ్దాల క్రితం చనిపోయిన ఆయన చూపిన పోరాట మార్గం అనుసరనీయం, ఆచరణీయమని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షులు వి. కోటేశ్వరరావు అన్నారు. విప్లవోద్యమంలో అమరత్వం చెందిన అమరవీరులను స్మరిస్తూ నవంబర్ 1 నుండి 9 వరకు స్మరించుకుంటున్న సందర్భంగా శనివారం సూర్యాపేటలో చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రం నందు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 40 వర్ధంతి సభను సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో గంట నాగయ్య అధ్యక్షతన నిర్వహించారు. సభకు ముందు సి పి రెడ్డి చిత్రపటానికి సిపిఐ (ఎమ్ .ఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం. డేవిడ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి. కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పోరాటపటమును అలవర్చుకొని ఇంజనీరింగ్ కాలేజీలో బహిష్కరణకు గురై పీడిత, తాడిత ప్రజల కోసం అంకితమయ్యి విప్లవ కమ్యూనిస్టు రాజ్యం కోసం అహర్నిశలు కృషి చేశారని అన్నారు.



తన జీవితకాలంలో 30 సంవత్సరాలు విప్లవోద్యమానికి, 17 సంవత్సరాలు రహస్య జీవితాన్ని గడిపారని కొనియాడారు. తెలంగాణ సాయుధరైతంగా పోరాట ప్రభావం తో వచ్చి జైలు జీవితాన్ని గడిపారని, ఆ పోరాటాన్ని విరమించడానికి తీవ్రంగా వ్యతిరేకించారు. 1952లో కర్నూలు జిల్లాలో ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో ప్రజల తరపున అనర్గళంగా వాయిస్ ని వినిపించారు. 1964లో సిపిఐ నుంచి సిపిఎం గా విడిపోయే సందర్భంలో రాజకీయ పోరాటాన్ని చురుకుగా ప్రదర్శించారు. దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్యలతో కలిసి సిపిఎం రివిజనిస్టు సిద్ధాంతాలను ఎండగడుతూ సిపిఎం నుండి తెగ తెంపులు చేసుకొని విప్లవ పంథా ను రూపొందించి మార్క్సిస్టు సిద్ధాంతకర్తగా ఈ దేశ నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిజం,లేనినిజం, మావో ఆలోచన విధానాన్ని అన్వయింపజేసి గోదావరి లోయ లో ప్రతిఘటన ఉద్యమాన్ని నిర్మాణం చేశారని అన్నారు. ఏజెన్సీలే కేంద్రంగా ప్రతిఘటన పోరాటాల వెల్లువలో లక్షలాది ఎకరాల భూములను పేద ప్రజలకు పంచిపెట్టారని అన్నారు. ఆ పోరాట మార్గమే నేడు దేశంలో ఆచరణీయమని, అనుసరణీయమని తేటతెల్లం చేస్తూ రుజువు చేస్తుందని అన్నారు. దున్నేవానికి భూమి కేంద్రంగా భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు చేసి అనేక భూములు పంచిపెట్టారని అన్నారు. మోడీ ప్రభుత్వం మూడు రైతు చట్టాలను కార్పొరేట్ల ఆనుకూలంగా తెస్తే ఢిల్లీలో రైతాంగం సంవత్సరం కాలం పాటు పోరాటం చేసి ఆ చట్టాలను వెనక్కు తీసుకునే విధంగా ప్రతిఘటించారని అన్నారు. ఢిల్లీలో షాహిన్ బాగ్ లో పౌరసత్వ చట్ట సవరణకు వ్యతిరేకంగా మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తే వాటినీ వెనక్కు తీసుకునే విధంగా పోరాటం కొనసాగిందని అన్నారు. ఆ ప్రతిఘటన పోరాటాలే ఈ దేశానికి దార్శణికం, ఆ పోరాటాలే అజేయం అని అన్నారు. అమరవీరులు అందించిన పోరాట స్ఫూర్తితో సమరశీల ఉద్యమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం. డేవిడ్ కుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు పోటు లక్ష్మయ్య ఐఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, ఏ ఐ కె ఏం ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలేబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి అలుగుబెల్లి వెంకటరెడ్డి, కాకి మోహన్ రెడ్డి, అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచనపల్లి సైదులు, పి ఓ డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నరసమ్మ, కోట మధుసూదన్ రెడ్డి, సామా నర్సిరెడ్డి, మేకల మేకల కనకారావు, గండు నగేష్, పోరెండ్ల దశరథ, పి డి ఎస్ యు రాష్ట్ర కమిటీ సభ్యులు కంచనపల్లి శ్రీను, పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు పుల్లూరు సింహాద్రి, పిడిఎస్ యు డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, వీరబోయన రమేష్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కెసీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

పాలకీడు, విశాలభారతి: సీఎం రేవంత్ రెడ్డికి కేసీఆర్ బిక్ష వల్లనే నువ్వు ముఖ్యమంత్రివి అయ్యావని రాష్ట్ర యువజన నాయకులు పెరుమాళ్ళ సతీష్ అన్నారు. పాలకీడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ జాతిపిత అసాధ్యం అనుకున్న తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయడానికి చావు నోట్లో తలపెట్టి, తన పదవులు అన్నింటిని తృణ ప్రాయంగా త్యాగం చేసి, అన్ని పదవులకు రాజీనామాలు చేసి,ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎంతగానో కష్టపడి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ని కుక్క చావు చస్తావని రేవంత్ రెడ్డి మాటలకి రాష్ట్ర ప్రజలంతా పార్టీలకతీతంగా బాధపడుతున్నారు. నువ్వు ఈ రోజు తెలంగాణ రాష్టానికి ముఖ్యమంత్రివి అయ్యావంటే అది కేసీఆర్ భిక్ష అని తెలిపారు. అలాంటి ఒక ప్రతిపక్ష హోదాలో ఉన్న నేతను చావు కోరుకోవడం రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడే మాటలేనా ఒక్కసారి ఆలోచించుకోవాలి అని అన్నారు. కార్యక్రమంలో అశోక్, పిచ్చయ్య, వీరబాబు, నవీన్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా యూత్ కాంగ్రెస్ నాయకులు గోపినాథ్ జన్మదిన వేడుకలు

శాలిగౌరారం,విశాలభారతి:

తుంగతుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు వేముల గోపినాథ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే మందుల సామేలు సమక్షంలో శనివారం కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేలు యూత్ కాంగ్రెస్ నాయకులు గోపినాథ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు సేవ చేస్తూ భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉండేందుకు తమ వంతు పాత్రను పోషిస్తూ ముందుకు వెళ్లాలని , గోపినాథ్ కు ఆ భగవంతుడు ఆయురారోగ్యాలను ఉంచాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందాల సమరం రెడ్డి, పిఏ సి ఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గూని వెంకటయ్య, చింత ధనంజయ ,వడ్లకొండ పరమేష్ ,బిక్షం రెడ్డి, యుగంధర్ రెడ్డి ,భూపతి వెంకన్న, బోడ అరుణ్ పాకాల సతీష్,దేవరకొండ జయరాజు, తోటకూరి పరుశరాములు, పల్స సైదులు, నూక కిషోర్ ,దేవరకొండ శంకర్ ,తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

▸ సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామనాధం

పినపాక, విశాలభారతి:

సమగ్ర కుటుంబ సర్వే మొదటి దశలో భాగంగా ఇంటి నెంబర్, ఇంటి యజమానిని గుర్తించి స్టిక్కరింగ్ పూర్తిచేసిన అధికారులు నేటి నుండి రెండవ దశలో భాగంగా ఇంటింటికీ తిరిగి కుటుంబ సంపూర్ణ వివరాలు సేకరిస్తున్నారు. పినపాకలో జరుగుతున్న సమగ్రకుటుంబ సర్వేలో పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామానాథం గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే దేశానికే ఆదర్శం అన్నారు. సర్వేను అత్యంత కచ్చితత్వం తో, ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా సంపూర్ణ కుటుంబ వివరాలను సేకరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అజ్ఞాత వ్యక్తులు సమగ్ర కుటుంబ సర్వే పేరుతో సైబర్ నేరాలకు పాల్పడుతున్న దృష్ట్యా ఫోన్ ద్వారా గాని, ఇంటికి వచ్చి గాని ఎవరైనా బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటిపి వివరాలు తెలపమని అడిగితే తిరస్కరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు స్వతంత్ర రెడ్డి ,యాకూబ్ పాషా, కొంపెల్లి నాగేశ్వరరావు మరియు తదితరులు పాల్గొన్నారు.



## సర్వేను సమర్థవంతంగా నిర్వర్తించాలి

▸ ఎమ్మెల్యే మందుల సామేలు

శాలిగౌరారం, విశాలభారతి:

పెర్క కొండారం గ్రామంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన సమగ్రహ సర్వేను స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే ద్వారా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అనగారిన వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. సర్వేకు ప్రజలంతా సహకరించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని అధికారులు పూర్తి చేయాలని సమర్థవంతంగా సర్వేను నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతిలక్ష్మి ,తహసిల్దార్ యాదగిరి, ఆర్ ఐ అజారుద్దీన్,రాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కందాల సమరం రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి ,చింత ధనంజయ, వడ్లకొండ పరమేష్ ,భూపతి వెంకన్న ,బిక్షం రెడ్డి ,యుగంధర్ రెడ్డి, వేముల గోపీనాథ్ ,పల్స సైదులు ,దేవరకొండ జయరాజు, పాకాల సతీష్, నూక కిషోర్, దేవరకొండ శంకర్ దేవరకొండ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సందేహాలు తీర్చాలి

మొదటిపేజీ తరువాయి

ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజల నుంచి అనేక సందేహాలు వ్యక్తమవుతుంటాయని అన్నారు. జిల్లా కలెక్టర్లు ఎన్యుమరేటర్లతో ఎప్పటికప్పుడు మాట్లాడితే, ప్రజల సందేహాలు ఏంటో వెనువెంటనే తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

**ప్రజల అనుమానాలు తీర్చాలి..**

ప్రజల సందేహాలను కలెక్టర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి వారి అనుమానాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని ఆదేశించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కువ సార్లు సర్వేలో భాగస్వాములు అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. భారతదేశంలో జరిగే అతిపెద్ద కార్యక్రమం ఈ సమగ్ర కుటుంబ సర్వే అని మనం చూపే నిబద్ధతపైనే ఈ సర్వే విజయవంతమవడం ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు. యావత్ దేశం మొత్తం తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న కుటుంబ సర్వేను గమనిస్తుందని వివరించారు.



**దేశమంతా గమనిస్తోంది**

దేశంలో ప్రగతిశీల భావాలు, కార్యక్రమాలను వ్యాప్తి చేయడానికి ఈ సర్వే గొప్పగా ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు ప్రతి చిన్న విషయం కూడా నిర్లక్ష్యం చేయకుండా ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి, ఇతర ఉన్న అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఇంటింటి సర్వేపై జిల్లా కలెక్టర్లతోపాటు అన్ని స్థాయిల్లోని అధికారులు, సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ప్రధానంగా పట్టణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన పేర్కొన్నారు.

## రేవంత్ .. నేనొస్తున్నా కాసుకో..

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొనగా.. కేసీఆర్ సమక్షంలో సినిమా ప్రొడ్యూసర్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, నటుడు రవితేజ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వాళ్లకు కండువా కప్పి కేసీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ క్రమంలో మాట్లాడిన కేసీఆర్.. కాంగ్రెస్‌ప్రభుత్వంపై, హైడ్రా కూల్చివేతలు, బీఆర్ఎస్ నేతల అరెస్టులపై ఘాటుగా స్పందించారు. "అన్ని జిల్లాల్లో జనం చెబుతున్నారు. మళ్ళీ మన ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది. వచ్చే ఎన్నికల్లో 100 శాతం మనమే అధికారంలోకి వస్తాం. అందులో అనుమానమే లేదు. ప్రజలు ఏం కోల్పోయారో వారికి అర్థమయ్యింది. ఇప్పటికే కొత్త ప్రభుత్వం వచ్చి 11 నెలలు గడిచిపోయాయి. ప్రభుత్వం అంటే అందర్నీ కాపాడాలి. సమాజాన్ని నిలబెట్టి నిర్మాణం చేయాలి. కూలగొడతామంటూ పిచ్చిగా మాట్లాడొద్దు. తిట్టడం మాకు కూడా వచ్చు. ఇవాళ మొదలు పెడితే రేపటి వరకు తిడతా. ప్రజలను కాపాడాల్సింది పోయి, భయపెడతారా. అరెస్టలకు భయపడేది లేదు. ప్రజలు మీకు బాధ్యతను అప్పగించారు. ప్రభుత్వం బాధ్యతాయుతంగా సేవ చేయాలి. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్నవాళ్లు ఎలా మాట్లాడుతున్నారో మీరు చూస్తున్నారు. గత ఎన్నికల్లో మనం మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలు 10 శాతమే.. కానీ 90 శాతం ఎవరు ఆడగకున్నా పనులు చేసి చూపించాం." అంటూ కేసీఆర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.



## పోలీసులపై మరోసారి అసంతృప్తి వ్యక్తం చేసిన పవన్ కల్యాణ్

- గత సెప్టెంబరులో కాకినాడలో ఇద్దరు విద్యార్థుల మృతి
- మృతుల కుటుంబసభ్యులను పరామర్శించిన పవన్
- రోడ్డు ప్రమాదాల వేళ పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలని హితవు
- పోలీసుల తరపున మృతుల కుటుంబాలకు క్షమాపణ

స్టేట్ బ్యూరో, విశాలభారతి:

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవల తరచుగా పోలీసులపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. తాజాగా, మరోసారి పోలీసులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గత సెప్టెంబరులో కాకినాడలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా... పవన్ నేడు వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఈ సందర్భంగా పవన్ స్పందిస్తూ, రోడ్డు ప్రమాదాల వేళ పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలని హితవు పలికారు. కాకినాడ జిల్లాలో ఇద్దరు విద్యార్థుల మృతి ఘటనలో పోలీసుల తీరు బాధ కలిగించిందని అన్నారు. మృతుల కుటుంబాలకు పోలీసుల తరపున తాను క్షమాపణలు చెబుతున్నానని వెల్లడించారు. అంతటి బాధలో కూడా విద్యార్థి రేవంత్ అవయవదానం చేసేందుకు ముందుకొచ్చిన తల్లిదండ్రుల మానవత్వం కదిలించిందని అన్నారు. బాధిత కుటుంబాలకు సొంతంగా రూ.2 లక్షల చొప్పున సాయం అందిస్తున్నట్టు ప్రకటించారు.

పోలీసులు బాధ్యతగా పనిచేయకపోతే, వారు చేసిన తప్పులు కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తాయని అన్నారు. రోడ్డు ప్రమాదాలలో కేసుల భయం కాకుండా, తక్షణ సాయం అవసరమని తెలిపారు. ఈ విషయంలో అవగాహన కల్పించే దిశగా పోలీసులు పని చేయాలని సూచించారు.






# స్మార్ట్ హోమ్స్‌తో పర్యావరణం పదిలం

## స్మార్ట్ హోమ్స్‌తో తగ్గనున్న వాతావరణ మార్పుల ప్రభావం
## కార్బన్ ఫుట్ ప్రింట్ నిరోధంతో సుస్థిర జీవనం
## నగరంలో పెరుగుతున్న స్మార్ట్ హోమ్స్ ఆవశ్యకత

పట్టణీకరణ పర్యావరణానికి ప్రాణ సంకటంగా మారుతుంది.

“ నానాటికి వాతావరణ మార్పుల ప్రభావం జీవరాశి మనుగడను ప్రశ్నార్థకంగా చేస్తోంది. ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా... పచ్చని పొలాలన్నీ రెసిడెన్షియల్ ప్రాంగణాలుగా మారుతున్నాయి. కనుచూపు మేరలో పచ్చదనం కనిపించడం లేదు. దీంతో ఏటా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అకాల వర్షా లు లేదా భారీ వర్షా లకు కారణం అవుతుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రకృతి వైపరీత్యాలు మనిషి మనుగడను మరింత కష్టంగా మారుతుంది. దీనంతటికి కార్బన్ ఉద్గారాల తీవ్రత ఎక్కువగా ఉండే రియల్ ఎస్టేట్ రంగానికి స్మార్ట్ హోమ్ ఫీచర్ దిక్సూచిలా మారుతుంది. మనిషి జీవనశైలికి అనుగుణంగా, ఆధునాతన సాంకేతికత సౌకర్యవంతంగా ఉండటంతోపాటు, పర్యావరణం సంరక్షించుకునే వీలు ఉంది. ఈ క్రమంలో సుస్థిర పర్యావరణాన్ని పెంపొందించడంలో స్మార్ట్ హోమ్స్ ఇప్పుడు అత్యంత కీలకంగా మారనుండగా ఈ వారం విశాలభారతి రియల్ టాక్‌లో ప్రత్యేక కథనం.

**విశాలభారతి, హైదరాబాద్ :**

ప్రపంచానికి ఎదురైతున్న పర్యావరణ సవాళ్లకు వినూత్న పరిష్కారాలు అవసరం. అందుకు అనుగుణంగా సుస్థిరమైన భవిష్యత్‌ను నిర్మించడంలో సాంకేతికత ఆశాకిరణంగా నిలుస్తోంది. ఆధునాతన టెక్నాలజీ సాయంతో పనిచేసే స్మార్ట్ హోమ్స్ మనిషికి సౌలభ్యమైన జీవనాన్ని అందించడంతోపాటు, కార్బన్ ఉద్గారాలను తగ్గించి పర్యావరణ ప్రయోజనాలను పెంపొందిస్తోంది. స్మార్ట్ హోమ్ టెక్నాలజీ విస్తృతంగా వినియోగంలోకి వస్తే అనేక పర్యావరణ ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా శక్తి వినియోగాన్ని అరచేతి ద్వారానే నియంత్రించే వీలు దొరకుతుంది. అదేవిధంగా సమర్ధవంతమైన నీటి, వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛమైన గాలి ప్రసరించే ఇంటి పరిసరాలు ఇవన్నీ కూడా నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులకు స్మార్ట్ హోమ్స్ తో సాధ్యపడనుంది. వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గిస్తే కాంక్రీట్ జంగిల్‌లోనూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పొందేందుకు అవకాశం ఏర్పడుతుంది.

**స్మార్ట్ గా శక్తి వనరుల వినియోగం...**

గృహాలను స్మార్ట్ హోమ్‌లుగా రూపాంతరం చేయడం ద్వారా ఇంటి పరిసరాల్లో సమర్ధవంతంగా శక్తి వినియోగం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఇంటి ఆవరణలో వినియోగించే సాధారణ బల్బులకు బదులుగా స్మార్ట్ హోమ్స్ విధానంలో కేవలం ఎల్‌ఈడీ బల్బులను మాత్రమే వాడుతారు. దీనికి మరింత సాంకేతికతను జోడించి సెన్సార్‌తో పనిచేసే టెక్నాలజీ వాడుకలోకి తీసుకురావచ్చు. దీంతో మనిషి ప్రమేయం లేకుండా ఆటోమేషన్ విధానంలో కాంతి ప్రసారం, సహజ కాంతికి అనుగుణంగా లైటింగ్ మార్పులు జరిగిపోతాయి. దీని వలన శక్తి వనరుల వృథాను తగ్గించడంతో కరెంట్ బిల్లులు, పర్యావరణంలోకి కార్బన్ ఫుట్ ప్రింట్ నియంత్రణలోకి వస్తుంది. స్మార్ట్ లైటింగ్ సిస్టమ్‌లు శక్తి సామర్థ్యాన్ని పెంచుతాయి. అదేవిధంగా ఇంటి వాతావరణం కూడా మెరుగుపడుతుంది. నేచురల్ వెంటిలేషన్ తగ్గిపోయినప్పుడు మసకబారి ఉండే గదులన్నీ స్మార్ట్ లైటింగ్ సాయంతో ప్రకాశవంతంగా చేసుకోవచ్చు. రంగు, ఉష్ణోగ్రత మార్పు, వెంటిలేషన్ షెడ్యూల్ ఆధారంగా నియంత్రించుకోవచ్చు. స్మార్ట్ హోమ్ యజమానులు డే టైంలో సహజసిద్ధమైన లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చు. దీనితో సౌకర్యవంతమైన వెంటిలేషన్, ఖాళీగా ఉండే గదుల్లోనూ ఆటోమేటిక్‌గా ఆగిపోయే లైంటింగ్ సిస్టంతో అనవసరమైన విద్యుత్ వినియోగం తగ్గిపోతుంది.

**మంచి నీటిని ఒడిసిపట్టేలా...**

స్మార్ట్ హోమ్ టెక్నాలజీ ద్వారా ఇంటి అవసరాలకు వినియోగించే నీటిలో వృథాను అరికట్టవచ్చు. సమర్ధవంతమైన నీటి వినియోగం సులభంగా చేసుకోవచ్చు. ఆటోమేటెడ్ స్మార్ట్ వాష్ రూమ్స్, షవర్ హెడ్, కిచెన్, జనరల్ వాష్ రూంలలో ఇంటిగ్రేటెడ్ ట్యాప్ విధానం అందుబాటులోకి వస్తుంది. దీంతో అవసరానికి మించి నీటిని వినియోగించుకోవడం క్రమంగా తగ్గిపోతుంది. తక్కువ నీటి ద్వారానే రిఫ్రెష్ షవర్లను వాడుకోవచ్చు. అదే విధంగా స్మార్ట్ హోమ్ వాటర్ మేనేజ్ మెంట్ ద్వారా వ్యర్థ జలాల శుద్ధీ, రీసైక్లింగ్ కూడా సాధ్యపడుతుంది. వ్యర్థ జలాల వృథా, పునర్వియోగం ద్వారా సింక్‌లు, షవర్లు, లాండ్రీ మెషీన్‌ల నుంచి వచ్చే నీటిని శుద్ధి చేస్తాయి. వీటిని టాయిలెట్ ఫ్లషింగ్, క్లీనింగ్, ఇతర అవసరాలకు వాడుకోవచ్చు. వృధాగా పోయే నీటిని రీసైక్లింగ్ ద్వారా నీటి సంరక్షణ సాధ్యపడుతుంది. దీంతో మంచినీటి వనరులపై ఒత్తిడి తగ్గి మెరుగైన నీటి నిర్వహణ, భూగర్భ జలాలను పరిరక్షించుకోవచ్చు. ముఖ్యంగా పుట్టగొడుగుల్లా వెలిసిన రెసిడెన్షియల్ కమ్యూనిటీలలో స్మార్ట్ వాటర్ మేనేజ్ మెంట్ నిర్వహణతో నీటి వనరుల సంరక్షించవచ్చు.

**వ్యర్థాల నిర్వహణ సులభతరం..**

స్మార్ట్ హోమ్ అప్లయన్స్ వినియోగంతో ఇంటిలో వ్యర్థాల నియంత్రించుకోవచ్చు. ముఖ్యంగా ఆహార వ్యర్థాల పరిమాణం గణనీయంగా తగ్గుతుంది. సెన్సార్లు, అబ్జర్వేటరీ సామర్థ్యం కలిగిన స్మార్ట్ హోమ్ అప్లయన్స్ వ్యర్థాల ఉత్పత్తి అదుపులోకి వస్తుంది. ఉదాహరణకు ఆహారం చెడిపోకుండా సంరక్షించడంతోపాటు, ఆహారం పాడైపోక ముందే వినియోగాలంటూ ఇంటి యజమానికి సమాచారం అందించే టెక్నాలజీ వాడుకలోకి వచ్చింది. ఇలాంటి ఫీచర్లతో స్మార్ట్‌గా పనిచేసే రిఫ్రిజిరేటర్లు, స్మార్ట్ వాషింగ్ మెషీన్, డిష్ వాషర్ల ద్వారా అవసరమైనంత మాత్రమే డిటర్జెంట్, నీటిని వినియోగించుకునే వెసులుబాటు ఉంటుంది. దీని ద్వారా అదనపు వృథా వ్యర్థాలను సమర్ధవంతంగా తగ్గించవచ్చు. సెన్సార్‌లతో కూడిన స్మార్ట్ ట్రాష్ క్యాన్‌లు పోగైన చెత్తను ఎప్పటికప్పుడు తెలుపుతాయి. చెత్త సేకరణ వ్యవహారాలను ఆటోమేటిగ్గా పూర్తి చేస్తాయి. స్మార్ట్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థల ద్వారా సాధారణ వ్యర్థాల నుండి పునర్వినియోగానికి అవకాశం ఉండే పదార్థాలను గుర్తించి, వాటిని రీసైక్లింగ్ చేసుకునే వీలు కలుగుతుంది. దీంతో ఆరుబయట కుప్పలుగా పేరుకుపోయే చెత్తను ఇంటిలోనే నియంత్రించుకోవచ్చు. రీసైక్లింగ్, కంపోస్టింగ్ రిమైండర్, అస్థిరమైన వ్యర్థాలను వేరు చేసే పద్ధతుల ద్వారా వ్యర్థాల నియంత్రణ వేగంగా జరిగిపోతుంది.

**అరచేతిలో సమాచారం...**

స్మార్ట్ హోమ్‌లు ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను నియంత్రించగలవు. ఎలక్ట్రిక్ కారు, లేదా బైక్ కలిగి ఉన్న యజమానులు ఇంటి ఆవరణలో స్మార్ట్ హోమ్ EV ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసుకోవడం వలన అవసరమైనప్పుడు ఛార్జింగ్ ఏర్పాటు చేయడం, తొలగించడం కూడా ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. దీంతో స్మార్ట్ హోమ్‌లు కార్బన్ ఉద్గారాలను తగ్గించే సుస్థిరమైన రవాణా సదుపాయాలను పెంచవచ్చు. అదేవిధంగా జీరో ఎమిషన్ ఉండే ఎలక్ట్రిక్ వాహనాలతో క్రమంగా శిలాజ ఇంధనాలపై ఆధారపడే రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది.

ఇంటిలో వినియోగించే విద్యుత్ ఎంత? రోజువారీ నీటి అవసరాలు ఎలా ఉన్నాయి. వృథా నీటి పరిమాణం ఎంత? వ్యర్థాల ఉత్పత్తి ఏవిధంగా ఉంది.? పునర్వినియోగానికి ఆస్కారం ఉన్న వనరులు ఉన్నాయా? ఇంటిలో గాలి నాణ్యత ఎలా ఉంది? వంటి సమాచారాన్ని ఇంటి యజమానులు తెలుసుకునే సౌకర్యం ఏర్పడుతుంది. ఇలా ఆధునాతన టెక్నాలజీతో కూడిన స్మార్ట్ హోమ్స్ సాయంతో... పర్యావరణ సమస్యలను ఇంటి నుంచే పరిష్కరించవచ్చు. దీంతో సుస్థిరమైన జీవనాన్ని పెంపొందించడం కూడా సాధ్యపడుతుంది.




### ఇంటి వాతావరణాన్ని మార్చే టెక్నాలజీ

ఏసీలు, నిరంతరం నడిచే ఫ్యాన్లు, హీటర్ల మూలాన ఇంటి ఆవరణలో గాలి నాణ్యత పడిపోయే అవకాశం ఉంది. దీంతో నివాసితుల ఆరోగ్యం ప్రభావితం అవుతుంది. అలాంటి వాటికి ఆస్కారం లేకుండా టెక్నాలజీ ఇప్పుడు మార్కెట్లోకి వచ్చింది. సెన్సార్ల ద్వారా పనిచేస్తూ ఎయిర్ క్వాలిటీని మెరుగుపరచవచ్చు. స్మార్ట్ ఏసీల ద్వారా అస్థిర కర్బన సమ్మేళనాలు, వాతావరణంలో ధూళి కణాలు, కాలుష్య కారకాలను నిరంతరం పర్యవేక్షించుకోవచ్చు. మనిషికి అవసరమైన పరిమాణంలో స్వచ్ఛమైన గాలిని అందించడంలో స్మార్ట్ హోమ్ అప్లయన్స్ ద్వారా వీలు దొరుకుతుంది. ఫ్రెష్ ఎయిర్ ఫ్లో అందించే స్మార్ట్ ఎయిర్ ప్యూరిఫైయర్లు, ఏసీలూ హానికరమైన కణాలు, అలెర్జీ కారకాలు, దుర్వాసనలను గుర్తించి ఆరోగ్యకరమైన జీవనానికి అనువైన ఇంటి వాతావరణం సృష్టించుకోవచ్చు. ఉత్తమ స్మార్ట్ థర్మోస్టాట్‌లు, క్లైమేట్ కంట్రోల్ సిస్టమ్‌తో పనిచేసే స్మార్ట్ అప్లయన్స్ వినియోగం వలన ఇంటిలో ఉండే జనాలను బట్టి వేడి, చల్లదనాన్ని నియంత్రించుకోవచ్చు. ఇంట్లో వారికి అనువైన సమయానికి షెడ్యూల్ చేసుకోవచ్చు. దీంతో ఎనర్జీ సేవింగ్ అవుతుంది. ఇంట్లో ఉన్నంత సేపు, ఉండే వారి సంఖ్యకు అనుగుణంగా అవసరమైన టెంపరేచర్, కూలింగ్‌ను సర్దుబాటు చేసుకోవడం వలన విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గిపోతుంది. బయట ఉష్ణోగ్రతలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రీ-కూల్, ప్రీ-హీట్ ఫీచర్లతో యజమాని ఇంట్లోకి అడుగుపెట్టగానే సౌకర్యవంతమైన వాతావరణాన్ని స్మార్ట్ హోమ్స్ ద్వారా పొందవచ్చు. వీటితోపాటు రిమోట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ వలన ఇంట్లో లేకున్నా... మొబైల్ అప్లికేషన్, ఇంటర్నెట్ సాయంతో గృహ యజమానులు తమ విద్యుత్ వినియోగాన్ని సర్దుబాటు చేసుకోవచ్చు. మొత్తానికి విద్యుత్ వినియోగాన్ని పొదుపు చేసుకోవడంతో పర్యవరణంపై ప్రభావం తగ్గిపోతుంది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
10.11.2024
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




## 'ప్రతిష్టాత్మకంగా కులగణన'



**తుర్కయంజాల్, విశాలభారతి:** రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుల గణనకు ప్రజలు సహకరించాలని టెస్కాబ్ వైస్ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. శనివారం తుర్కయంజాల్ లోని సత్తయ్య ఇంట్లో అధికారులు సర్వే నిర్వహించారు. అధికారులు అడిగిన వివరాలను సత్తయ్య, మాజీ సర్పంచ్ కొత్తకుర్మ కళమ్మ అంద జేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ కుల గణన వల్ల అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నామన్నారు. ప్రజలు సహకరిస్తే సర్వే సజావుగా సాగేందుకు అవకాశం ఉందని అన్నారు.





## ఉప్పల్ భగయాత్ లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యేకి ఏబీవీపీ వినతి అందజేత

**ఉప్పల్ ,విశాలభారతి:** ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఉప్పల్ భగాయత్ లో ఏర్పాటు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ ) ఆధ్వర్యంలో ఎస్ రావు నగర్ డివిజన్ లో నీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం డిగ్రీ కళాశాల మంజూరు చేయడం జరిగింది అని భగాయత్ లో ఏర్పాటు చేయాలనే కోరడం జరుగుతుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి ఉప్పల్ జోన్ కన్వీనర్ బుర్ర అఖిల్ , బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**నర్సింహులపేట, విశాలభారతి:** అనారోగ్యంతో బాధపడుతున్న పెద్ద నాగరం గ్రామ సీనియర్ నాయకులు గాడుదుల కోమిరెల్లిని శనివారం డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి.ఎస్ రెడ్యానాయక్ పమర్శించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు గుజ్జి వీరస్వామి, పెద్దనాగరం స్టేజ్ అధ్యక్షుడు అలిపురి రవీందర్ రెడ్డి, గ్రామ యూత్ అధ్యక్షులు కృష్ణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు అజ్మీర వంశీ నాయక్, నాయకులు లింగమల్లు, గండ్ర రాములు, కొమ్ముమదు, కొమ్ము వీరభద్రం, గుజు వెంకన్న, లింగ్యానాయక్, ఉపేందర్ తదితరులు ఉన్నారు.



## అమరవీరుల ఆశయ సాధనకై ఉద్యమిద్దాం

**కురవి, విశాలభారతి:** మండలంలోని బంచరాయితండ గ్రామపంచాయతీలో కామ్రేడ్ హచ్చన్న స్తూపం దగ్గర సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు తావు అధ్యక్షతన సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్కె బాబన్న జెండా ఆవిష్కరించారు. అనంతరం కామ్రేడ్ లింగన్న స్తూపం దగ్గర వెంకన్న అధ్యక్షతన పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె మదార్ హాజరై మాట్లాడుతూ గోదావరి లోయ పరివాహక ప్రాంతంలో భూమికోసం భుక్తి కోసం ఈ దేశ విముక్తి కోసం కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి , పొట్ల రాం నరసయ్య నీలం రామచంద్రయ్య మన జిల్లా ఉద్యమంలో కామ్రేడ్ దొరన్న కామ్రేడ్ మాధవ్ అన్న కామ్రేడ్ సురేష్ అన్న మురళి ఎల్లన్న పుల్లన్న గణేషు, కామ్రేడ్ హచ్చన్న, లింగన్న, తదితరులు అమరులయ్యారు. వారి ఆశ సాధన కోసం మనము ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. విప్లవద్యమంలో నవంబర్ మాసంలోనే అనేకమంది వీరులు అమరులయ్యారు. కనుక ప్రతి సంవత్సరము ఒకటి నుండి తొమ్మిది వరకు సంస్కరణ సభలను నిర్వహించుకుంటున్నాం వారి ఆశయం దున్నే వాడికే భూమి కావాలి పీడత రాజ్యం రావాలంటే నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే సాధ్యమవుతుందని వారు అన్నారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర నాయకులు పాపన్న, భాస్కర్, కోబల్, సుక్కి, బొజ్జ, సుగుణీ తదితరులు గ్రామ వాసులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

- తహశీల్దార్ కి వినతి పత్రం అందజేత



**మణుగూరు, విశాలభారతి:** మణుగూరులో గ్రామ సింహాల గుంపులు ప్రజల్ని హడలేత్తిస్తున్నాయని వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతూ శనివారం మణుగూరు తహశీల్దార్ వి. రాఘవరెడ్డి కి వినతి పత్రం అందజేసినట్లు సామాజిక సేవకులు కర్నె బాబురావు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం సమితి సింగారం పంచాయతీ పరిధిలోని సీతానగరంలో గత రెండు రోజుల క్రితం వీధి కుక్క ఒక చిన్నారి తో పాటు నలుగురు పెద్దలను కూడా తీవ్రంగా గాయపరిచిందని, మండలంలో వీధి కుక్కల వల్ల ఏదో ఒకచోట ఏదో ఒక సంఘటన చోటు చేసుకుంటోందన్నారు. దీంతోపాటు రాత్రి వేళల్లో కుక్కల అరుపులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గురువారం నాడు సింగరేణి కార్మికుడ్ని కూడా తీవ్రంగా గాయపరిచాయన్నారు. వీరితోపాటు మణుగూరు మున్సిపల్ కమిషనర్ కి కూడా వినతిపత్రం అందజేయనున్నట్లు కర్నే బాబురావు తెలిపారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం పొందాలి

- కల్వకుర్తి మున్సిపల్ అధ్యక్షుడు ఎడ్మ సత్యం



**కల్వకుర్తి విశాల భారతి** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం కలిగి ఉండాలని.. నేటి సమాజంలో క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, క్రీడల వల్ల మానసిక ఉల్లాసం దేహ దారుఢ్యం, స్నేహభావం పెంపొందుతాయని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు అన్నారు. డిసెంబర్ ఒకటో తారీఖున మంచిర్యాల జిల్లా శ్రీ ఉషోదయ హై స్కూల్ స్టేడియంలో జరగబోయే 10వ తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్స్ కోసం శనివారం కల్వకుర్తి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్ జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎడ్మ సత్యం పాల్గొని సోలపోగుల స్వాములుతో కలిసి జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. అండర్ 08,10,12, సంవత్సరాల వయో విభాగాల్లో నిర్వహించిన ఈ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి దాదాపు 250 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారని, వీరందరిలో నుంచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 25మంది క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు స్వాములు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా అథ్లెటిక్స్ సెలక్షన్స్ లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన చేసిన క్రీడాకారులకు అసోసియేషన్ తరపున ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి తరం యువత క్రీడల్లో పాల్గొనడం ద్వారా పోరాట పటిమ కలిగి, గెలవాలనే కసి పెరిగి, జీవితంలో ఉన్నత స్థానానికి చేరాలనే క్రమశిక్షణ పట్టుదల సిద్ధిస్తుందని, తద్వారా తమ దైనందిన జీవితాల్లో కూడా ఎటువంటి ఒడిదుడుకులు ఎదురైనా సులువుగా ఎదుర్కొనే ధైర్య సాహసాలు అలవరతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పరశురామ్, స్థానిక జెడ్పీ బాయ్స్ హై స్కూల్ హెడ్మాస్టర్ బాలు నాయక్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్.ప్రసాద్, సీను యాదవ్, వైస్ చైర్మన్ షహేద్, పిఎసిఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, కౌన్సిలర్ తహేర్ అలీ, సీనియర్ క్రీడాకారుడు ఖోఖో రాజు, రవి పరశురాముడు, ముజ్జు వెంకటేష్ రవీందర్ రెడ్డి, శేఖర్, ఫిజికల్ డైరెక్టర్ సుభాషిని భాను, రాజేందర్, బాలస్వామి, శ్రీశైలం, చందు, మల్లేష్, నర్సిరెడ్డి, కుమార స్వామి, రమేష్, బాలయ్య, స్వేరోస్ నాయకులు భీమయ్య, ఎం.డి తురాబ్, పీఈటీ లు రాజేందర్, శ్రీను, వినోద్ కుమార్, సైదులు, నరేష్, నిర్మల, రాధిక, తల్లిదండ్రులు లక్ష్మి, అరుణ, దేవమ్మ, ఝాన్సీరాణి, మాజీ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



## సమర్ధవంతంగా కులగణన

**ఆమనగల్లు, విశాల భారతి :** కులగణనలో ఎలాంటి తప్పులు దొర్లకుండా సమగ్ర సమాచారం సేకరించి సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీఓ శ్రీను నాయక్ సూచించారు. శనివారం ఆమనగల్లు మండలం శంకర్ కొండ తండా, సామాయపల్లి, మేడిగడ్డ తండా, ఆమనగల్లు మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న కుల గణన ఓటర్ల జాబితా ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లలిత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.అమనగల్లులు మున్సిపాలిటీలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయం, కుల సర్వే, సమగ్ర ఇంటి సర్వే చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ వసంత మాట్లాడుతు సర్వే దరఖాస్తులను జాగ్రత్తగా నింపాలని, సమగ్ర ప్రజలందరూ సహకరించాలని కోరారు. చైర్మన్ రాంపాల్, వైస్ చైర్మన్ దుర్గయ్య,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**మైసిగండి గ్రామంలో:**

మైసిగండి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ, కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభించారు. ఈ సర్వేలో ఈ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ మండలఅధ్యక్షుడు హీరాసింగ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కేస్టాలిన్, కిషన్, మాజీ తులసిరామ్,బాబ, మదన్,రమేష్,.భోని, శంకర్,రమేష్ పాల్గొన్నారు.



## దాడి చేసిన వారిపై పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారు

- అంబేద్కర్ యువజన సంఘం బిఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా
- ఎఫ్ ఐ ఆర్ నమోదైన వారిని వెంటనే అరెస్టు చేయాలి

**ఆర్మూర్ ,విశాల భారతి** ఘర్షణలో దాడి చేసిన వారిపై పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అంబేద్కర్ యువజన సంఘం, బిఎస్పీ ఆధ్వర్యంలో శనివారం నందిపేట్ మండల కేంద్రంలో బస్టాండ్ ఎదురుగా ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు సింగాడే పాండు , కామారెడ్డిజిల్లా అధ్యక్షులు ఈశ్వర్, మండల అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ ఈనెల మూడవ తేదీన నందిపేట మండలం షాపూర్ గ్రామానికి చెందిన జైలు మల్లయ్య నందిపేట్ నుండి షాపూర్ గ్రామానికి వెళ్లి మార్గమధ్యంలో ముత్యాలమ్మ గుడి దగ్గర బైకు కారు ఢీకొన్నాయి. మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి, అతనిని ఆసుపత్రికి పంపించారు. అనంతరం కారు వివరాలు తెలుసుకొని క్రమంలో ఇరువు వర్గాల మధ్య గొడవ జరిగింది. షాపూర్ గ్రామానికి చెందిన కొమ్మిరి సుధాకర్ వేళ్ళు విరిగిపోయాయి. ఈ ఘటనపై నందిపేట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. రోడ్డు ప్రమాదానికి కారకులైన నిజాంబాద్ వాసులుగా గుర్తించి కేవలం 9 మందిపైనే ఎఫ్ ఐ ఆర్ చేయడం జరిగింది. మిగతా 9 మంది వదిలి పెట్టారని సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు రాజకీయ నాయకులకు తలొగ్గి జాప్యం చేస్తున్నారని అన్నారు. ఇట్టి విషయాన్ని తీరం ఖండిస్తూ బిఎస్పి, ఏవైఎస్ ఆధ్వర్యంలో నిరసన చేయడం జరిగింది. ఎఫ్ఐ ఆర్ నమోదు చేసిన వారిని అరెస్టు చేయరని కోరారు. ఘటన స్థలానికి సిఐ శ్రీధర్ రెడ్డి చేరుకొని తప్పకుండా జరిగేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షాపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



## గీత సంఘం సదస్సు కరపత్రం ఆవిష్కరణ

- మండల అధ్యక్షులు డొనికెని రామన్న గౌడ్

**నర్సింహులపేట, విశాలభారతి:** నవంబర్ 29న తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా 67వ వార్షికోత్సవం సిరోల్ మండలం చింతపల్లి గ్రామంలోని జిహెచ్ గార్డెన్స్ లో జరుగుచున్నాయి. కావున మానుకోట జిల్లా సదస్సు జయప్రదం చేయాలని కల్లు గీత కార్మిక సంఘం నరసింహుల పేట మండల అధ్యక్షులు డోనికేని రామన్న గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కమిటీ పిలుపు మేరకు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ముందు వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గీత కార్మికుల సంక్షేమానికి అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని 10 సంవత్సరాల కాలంలో గీత కార్మికుల పక్షాన అనేక రకాల సమస్యలు లేవనెత్తిన పరిష్కరించని ప్రభుత్వాలు ఉన్నాయని వారు అన్నారు. కల్లుగీత కార్మిక సంఘం అనేక సంవత్సరాలుగా అనేక రకాల పోరాటాల నిర్వహిస్తున్నదని తెలిపారు. ప్రతి సొసైటీకి చెట్ల పెంపకానికి 5 ఎకరాల ప్రభుత్వ భూమి ఇవ్వాలని బీసీ కార్పొరేషన్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్న గౌడ గ్రూప్ సొసైటీలకు 30 లక్షల సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, వృత్తిలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టి సేఫ్టీ మొకులు వృత్తిచేసే వారందరికీ ఉచితంగా ఇవ్వాలని, సభ్యులందరికీ ద్విచక్ర వాహనాలు గీతన్న బీమా పథకం అమలు చేయాలని తాటి ఈత చెట్లను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



## సమన్యాయం కోసమే సమగ్ర సర్వే

- ప్రొద్దుటూరి వినయ్ రెడ్డి

**ఆర్మూర్,విశాల భారతి** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర సర్వే తో రాష్ట్రంలోని ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్మూర్ పట్టణ కేంద్రంలో జరుగుతున్న సమగ్ర సర్వేలో ఆయన పాల్గొని స్థానిక ప్రజలకు సమగ్ర సర్వే పై విశ్లేషించారు. ఈ సర్వే తో సమగ్ర కుటుంబ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన మొదలైన వివరాలతో పొందుపరచబడిన సమగ్ర సర్వే బుక్ లెట్ పై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని పదవ వార్డులో అధికారులు సమగ్ర సర్వే నిర్వహించారు. కుటుంబంలోని సభ్యుల వివరాల గురించి అధికారులు అడిగి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మున్సిపల్ చైర్పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, వైస్ చైర్మన్ షేక్ మున్ను, మున్సిపల్ కమిషనర్ ఏ రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు కొంతం మంజుల మురళి, వనం శేఖర్, భాగ్యలక్ష్మి శివ, మాజీ వైస్ చైర్మన్ లింగ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.కె బబ్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పరిశీలన

**మునుగోడు విశాల భారతి**

రత్తిపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర కుటుంబ సర్వేతో ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని శనివారం సమగ్ర కుటుంబ సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల గణన మొదలైన వివరాలతో పొందుపరచబడిన సమగ్ర సర్వే కుటుంబంలోని సభ్యుల వివరాల నమోదు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాధగోని రాజేష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర సర్వే అధికారులకు ప్రజలు సహకరించాలని అన్నారు. కుటుంబ సభ్యులు పూర్తి స్థాయిలో సమాచారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రవీందర్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు నర్సిరెడ్డి పాల్గొన్నారు



## దేశమంతా సమగ్ర కుటుంబ సర్వే వైపే చూస్తుంది

- సర్వేకు ప్రజలు సహకరించి తగిన సమాచారం అందించాలి
- జిల్లా కాంగ్రెస్ నాయకులు పంతంగి దశరథ గౌడ్

**సూర్యాపేట, విశాల భారతి**

1932లో దేశంలో జరిగిన సర్వే తిరిగి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో రాహుల్ గాంధీ ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్నారని, దీంతో దేశమంతా తెలంగాణలో జరిగే సమగ్ర కుటుంబ సర్వే వైపు చూస్తుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు పంతంగి దశరథ గౌడ్ అన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్చార్జి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి ఆదేశాల ప్రకారం 14వ వార్డులో సర్వే నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి కావలసిన సహాయ సహకారాలు అందించి మాట్లాడారు. ఈ సర్వేతో రాహుల్ గాంధీ సామాజిక వర్గాల పట్ల ఉన్న ప్రేమ వ్యక్తం అవుతుందన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సిబ్బంది అడిగిన ప్రతి ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వాలన్నారు. ఈ సర్వేతో వెనుకబడిన వర్గాలను గుర్తించి వారికి తగిన సంక్షేమ పథకాలు అందించడంతో పాటు రిజర్వేషన్లు పెంచడమే ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేలో ప్రజలంతా భాగస్వాములై కావలసిన సమాచారాన్ని అందించి విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. వార్డులో రాజకీయాలకు అతీతంగా నాయకులు సర్వేకు, సర్వే సిబ్బందికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్పి వై సంధ్యారాణి, సర్వే ఇన్చార్జి బి.రామకృష్ణ తదితరులు ఉన్నారు.




## ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

- పాణినీయ డెంటల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ హాస్పిటల్ సహకారంతో
- పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో వైద్య శిబిరం

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

పాణినీయ డెంటల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆదిభట్ల మున్సిపాలిటీ చింతపల్లి గూడలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాల డైరెక్టర్ డి. నిహారిక రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి పేదలకు సేవచేయడం అభినందనీయమని తెలిపారు . ఈశిబిరంలో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులే కాకుండా వివిధ గ్రామాల నుంచి వచ్చి వైద్య సేవలను వినియోగించుకున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరము ఏదో ఒక రకమైన వైద్య సేవలను తమ పాఠశాల తరఫున ప్రజలకు ఉపయోగపడేలా సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## నవాబుపేట్ గ్రామ కార్యదర్శికి పరామర్శ



**చిగురుమామిడి, విశాల భారతి**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట్ గ్రామ కార్యదర్శి బడుగు సంపత్ కుమారుడు అనారోగ్యంతో మృతి చెందగా చిగురుమామిడి ఎంపీడీవో మధుసూదన్, ఎంపీవో రాజశేఖర్ రెడ్డి,సూపరిండెంట్ ఖాజా మొయినుద్దీన్,మండల నాయకులు బోయిని బాబు,బోయిని ప్రశాంత్ లు కార్యదర్శి స్వగ్రామమైన అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లికి వెళ్లి ఆయనను పరామర్శించి మృతికి గల కారణాలను తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# దేశ అభివృద్ధిలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకం

- చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే కేసులు సత్వర పరిష్కారం అవుతాయి
- జిల్లా లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి పి.శ్రీవాణి




**సూర్యాపేట, విశాల భారతి**

వ్యక్తి ఎదిగినప్పుడు సమాజం ఎదుగుతుందని సమాజం ఎదుగుదలతో దేశ అభివృద్ధి జరుగుతుందని అలాంటి అభివృద్ధిలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి పి. శ్రీవాణి అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జెకె రెసిడెన్సీలో సీనియర్ న్యాయవాది కె.వి. రామలింగారెడ్డి ప్రాంగణంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన చట్టాలపై అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంతోమంది అమరవీరుల పోరాటం రాజ్యాంగం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిందని గుర్తు చేశారు. చట్టపరమైన మార్పులతో పాటు అభివృద్ధి చట్టాల మార్పుపై అవగాహన ఎంతో అవసరం అన్నారు. చట్టాలపై న్యాయవాదులకు పూర్తి అవగాహన ఉన్నప్పుడే కేసుకు సత్వర పరిష్కారం లభించి కక్షిదారులకు సరైన న్యాయం చేయగలుగుతారన్నారు. ప్రతి విషయాన్ని తెలుసుకోవాలని ఒకరి ద్వారా ఒకరు చర్చ జరుపుకున్నప్పుడే ఏ విషయమైనా అవగతం అవుతుందని అన్నారు. కేసును స్వీకరించడమే కాకుండా ఆ కేసును ఎలా పరిష్కరించాలో తెలిసినప్పుడే కక్షిదారులకు సరైన న్యాయం లభిస్తుందన్నారు. ప్రతి న్యాయవాది తన చట్టాలు మార్పులపై అవగాహన పెంచుకోవాలనీ కోరారు. ముఖ్యంగా మహిళ న్యాయవాదులు ఈ అవగాహన సదస్సుకు రావడం ఆనందంగా ఉందని ప్రతి కార్యక్రమంలో మహిళ న్యాయవాదులు ఉత్సాహంగా పాల్గొనాలని అన్నారు. ఐఏఎల్ జాతీయ జనరల్ సెక్రటరీ బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ జాతీయ ఉద్యమంలో 1947 పూర్వం ఆ తర్వాత తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటంలో న్యాయవాదుల పాత్ర కీలకమని ఆయన అన్నారు. పేద ప్రజల రక్షణ కోసం ఐ ఏ ఎల్ పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ దుస్స జనార్ధన్, కెవిఎల్, విద్యాసాగర్ రెడ్డి, నూకల సుదర్శన్ రెడ్డి, గుడిపూడి వెంకటేశ్వర్ రావు, నాతి సవేందర్, బొమ్మగాని శ్రీనివాస్, తాళ్లపల్లి సత్యనారాయణ, తొగిటి మురళి, గుగులోతు రాజారాం, గుండ్రాల అశోక్, జటంగి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ పిల్లే, వి. వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ, అనంతల సందీప్, పాటు పెద్ద ఎత్తున న్యాయవాదులు పాల్గొన్నారు.



## సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి

- 82 ఎన్యుమిటర్లతో 11 వేలకు పైగా కుటుంబాలకు సర్వే షురూ
- సర్వేకు సంబంధించి పత్రాలు ముందుగానే సిద్ధం చేసుకోవాలి
- అనంతగిరి తాసిల్దార్ హిమబిందు

**అనంతగిరి, విశాలభారతి:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేకు ప్రజలందరూ సహకరించాలని అనంతగిరి తాసిల్దార్ హిమబిందు కోరారు.మూడు రోజులపాటు ఎన్యూమరేటర్లు తొలుత కుటుంబాలను గుర్తించి ఇంటింటికి వెళ్లి ఎన్ని కుటుంబాలు ఉన్నాయో గుర్తించి స్టిక్కర్లు అతికించారు.సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శనివారం మండల పరిధిలో అమీనాబాద్ గ్రామంలో సర్వే నిర్వహించారు ఈ సందర్భంగా తాసిల్దార్ హిమబిందు సర్వే ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు మండల వ్యాప్తంగా 8 సూపర్వైజర్లు, 82 ఎన్యుమిటర్లతో సర్వే జరుగుతుందని మొత్తం మండలాలు సుమారు 11 వేల కుటుంబాలకు గాను కుటుంబాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాలను నమోదు చేస్తారన్నారు.ప్రధాన ప్రశ్నలు 56, ఉపప్రశ్నలు 19 కలిపి మొత్తం 75 ప్రశ్నలతో కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేస్తారన్నారు.కుటుంబ సభ్యుల పేర్లతో పాటు అందరి మొబైల్ నంబరు సేకరిస్తారు. కులంతో పాటు ఆ కులాన్ని ఇతర పేర్లతో పిలిస్తే వాటిని కూడా రాసుకుంటారాన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటికి వస్తారని,అయితే వివరాల సేకరణలో భాగంగా కొన్ని పత్రాలు ఉంచుకుంటే వేగంగా సమాచారం సేకరణ పూర్తవుతుందని తహశీల్దార్ సూచించారు. ముఖ్యంగా ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, సెల్ ఫోన్ నెంబర్ల వంటివి అందుబాటులోకి ఉంచుకోవాలన్నారు.



## సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి జహంగీర్**

**చౌటుప్పల్, విశాలభారతి:**

పట్టణ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఆహ్వాన సంఘం సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జాంగిర్ మాట్లాడుతూ డిసెంబర్ 15న వేలాదిమందితో గొప్ప బహిరంగ సభ జరుగనుందని ఆయన అన్నారు. ఈ మహాసభలలో జిల్లా వ్యాప్త ఉద్యమాలకు కార్యచరణ రూపొందుతుందని అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో ఈ మహాసభలకు ప్రాధాన్యత ఉన్నది రాజకీయాలలోకి దేవుడిని లాగడం,అవకాశవాదం,ఆశ్రిత పక్షపాతం అవినీతి పెరుగుతున్న సందర్భాలలో ప్రజల్లో చైతన్యవంతం చేయడం కోసం పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం కోసం మహ సభలు జరుగనున్నాయి. ఈ మహసభలు విజయవంతం కోసం ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొండా మడుగు నరసింహ,బట్టుపల్లి అనురాధ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు,మంగా నర్సింహులు మాటూరి బాలరాజు గౌడ్,కల్లూరి మల్లేశం, దోనూరు నర్సిరెడ్డి, దాసరి పాండు, మేక అశోక్ రెడ్డి, సిరుపంగి స్వామి,దొడ యాదిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన చిరుమర్తి లింగయ్య

**చిట్యాల, విశాలభారతి:**

మండలంలోని ఎలిమినేడు గ్రామం శివం గార్డెన్ లో పిట్టంపల్లి గ్రామ వాస్తవ్యులు నూతన వధూవరులు కొమురెల్లి సంతోష్ రెడ్డి, చందన గార్ల వివాహ మహోత్సవానికి నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి దేవరపల్లి సత్తిరెడ్డి,టిఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు తుమ్మల నాగరాజు రెడ్డి, మాజీ వార్డు సభ్యులు మేడి రాజకుమార్, నాయకులు కొమురెల్లి శ్రీనివాస్ రెడ్డి, కొమురెల్లి రామిరెడ్డి, కొమురెల్లి మస్తుదన్ రెడ్డి,యూత్ నాయకులు సిద్ధగోని ఉపేందర్ గౌడ్,చిర్రగోని వెంకటేష్ యాదవ్, కొమురెల్లి అనిల్ రెడ్డి, కొమురెల్లి రాఘవేందర్ రెడ్డి, తుమ్మల మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నిషేధిత సిపిఐ మావోయిస్టులపై నిఘా

- ఏడూళ్ల బయ్యారం,కరకగూడెం పోలీస్ స్టేషన్లను సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**పినపాక, విశాలభారతి:**

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఏడూళ్ల బయ్యారం, కరకగూడెం పోలీస్ స్టేషన్లను సందర్శించారు. అక్కడ విధులలో ఉన్న పోలీస్ అధికారులను, సిబ్బందికి పలు సూచనలు చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లలో పనిచేసే పోలీస్ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ముందుగా పోలీస్ స్టేషన్లో పనిచేసే సిబ్బందికి పోలీస్ శాఖ తరఫున కేటాయించిన ప్రభుత్వ సామాగ్రిని పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్లలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధులపరంగా, వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని పోలీస్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. వర్టికల్స్ వారీగా ఎవరికి కేటాయించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఏజెన్సీ ప్రాంతంలో నివసించే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. కమ్యూనిటీ పోలీసింగ్లో భాగంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే యువత అందరికి చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించే విధంగా పలు పలు కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడుళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, కరకగూడెం ఎస్సై రాజేందర్, ఏడూళ్ల బయ్యారం ఎస్సై రాజ్ కుమార్, టిఎస్ఎస్పి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# అభివృద్ధికి నిధులు కేటాయించండి

- జలమండలి ఎండికి ఎమ్మెల్యే జిఎంఆర్ విజ్ఞప్తి

**పటాన్ చెరు,విశాలభారతి**

పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని భారతీ నగర్, రామచంద్రపురం, పటాన్ చెరు డివిజన్ల పరిధిలో జలమండలి ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు 13 కోట్ల 20 లక్షల రూపాయలు నిధులు కేటాయించాలని ఆ శాఖ ఎండి అశోక్ రెడ్డిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్ లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ల పరిధిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. బల్దియ పరిధిలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలతో పాటు, పాత కాలనీలలో అంతర్గత మురుగునీటి కాలువలు, సిసి రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రణాళికల సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా నిధులు కేటాయించాలని కోరారు. వీటితోపాటు గతంలో జలమండలికి కేటాయించిన ఆర్ హెచ్ సి ప్రాంతంలో ఆసుపత్రి సేవలు లేనందున స్థానిక అవసరాల కోసం జిహెచ్ఎంసి కి కేటాయించాలని కోరారు. ఎందుకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్ రెడ్డి త్వరలోనే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే

**మేడిపల్లి,విశాలభారతి:**



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా చేపట్టిన సామాజిక,ఆర్థిక, విద్య,ఉపాధి,రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) లో పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ 12వ డివిజన్ లో సర్వే చేస్తున్న ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు పక్కాగా నమోదు చేస్తున్నారా అని మేయర్ అమర్ సింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వార్డ్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత అందిపుచ్చుకోవాలి

- ద 8 మాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్ పోస్టర్ ఆవిష్కరణ
- మాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**




డిజైన్,టెక్నాలజీ రంగంలో సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానాన్ని యువత అందిపుచ్చుకోవాలని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ద 8 మాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్ పోస్టర్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. శనివారం మాదాపూర్‌లోని టి హబ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ డిజైన్,టెక్నాలజీ రంగంలో సృజనాత్మకతను, సహకార వృద్ధిని ప్రోత్సహించాలన్న తెలంగాణ నిబద్ధతను చాటుతుందన్నారు.సృజనాత్మకత, ఆవిష్కరణలకు కేంద్రంగా హైదరాబాద్ ఖ్యాతిని మరింత బలోపేతం చేయడం, పరిశ్రమల వృద్ధికి కొత్త అవకాశాలను పెంపొందించడం ఈ సదస్సు ముఖ్య లక్ష్యం అని తెలిపారు. ఈ నెల 20న ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ ప్రాంగణమైన టిహబ్‌లో జరిగే ఈ కార్యక్రమంలో డిజైన్ పరిశ్రమలోని నాయకులు,ఆవిష్కర్తలకు ఒక ప్రధాన సమ్మేళనం అవుతుందన్నారు.అంతకు ముందుగా జరిగిన ఈ వర్క్‌షాప్‌లో డిజైన్ విద్యార్థులు,ఇండస్ట్రీ నిపుణులు,మెంటార్లతో సహా 250 మందికి పైగా పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో పలువురి ప్రజంటేషన్లు అందుబాటులో ఉన్నాయి.ఈ సందర్భంగా ద 8 మాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్ అధికార ప్రతినిధి రాజ్ సావంకర్ మాట్లాడుతూ.. అర్థవంతమైన చర్చలు,సహకారానికి మా ఈ సదస్సు ఒక ఉత్ప్రేరకంగా పనిచేసిందన్నారు.అనుభవజ్ఞులైన పరిశ్రమ నిపుణుల నేతృత్వంలో ప్యానెల్ చర్చలను నిర్వహిస్తున్నందుకు మేము ఎంతో ఉత్సాహంగా ఉన్నామని,వారు తమ నైపుణ్యాన్ని అందరికీ అందించడానికి కృషి చేస్తామన్నారు. వివిధ రంగాల్లో సరికొత్త ఆవిష్కరణలతో కూడిన ప్రదర్శనలను రూపొందించడానికి, నెట్‌వర్కింగ్ అవకాశాలతో తోటివారితో అనుసంధానం కావడానికి ఇది అవకాశం కల్పిస్తుందన్నారు.సృజనాత్మక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని,భవిష్యత్తు పురోభివృద్ధికి బాటలు వేసే ప్రత్యేక వేదిక ఇదని స్పష్టం చేశారు.అందులో ముఖ్యంగా ఫ్యాషన్,జ్యువెలరీ, ఇంటీరియర్స్,సస్టెయినబిలిటీ,గేమింగ్, ప్రొడక్ట్ డిజైన్,ఏఆర్/వీఆర్, హెల్త్ కేర్ సహా పలు రంగాలకు చెందిన నిపుణులను ఏకతాటిపైకి తీసుకురావడానికి ఎవోల్ స్కిల్స్,మార్స్ మీడియా సంయుక్తంగా నిర్వహిస్తున్న 8 మ్యాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్ సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ఆలోచనాపరులు ఇన్‌సైట్లను పంచుకోవడానికి, ఆవిష్కరణలను ప్రదర్శించడానికి, డిజైన్ రంగం భవిష్యత్తును రూపొందించడంలో సహకరించడానికి ఈ కార్యక్రమం ఒక వేదికగా పనిచేస్తుందని పేర్కొన్నారు.



# విద్యార్థులు క్రీడల్లోనే గుర్తింపు

- ఫిట్నెస్ రాణించాలి
- జిల్లా వైద్యాధికారి వడ్డేన్న
- ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి అండర్ 19 ఖో ఖో పోటీలు

**సికింద్రాబాద్, విశాలభారతి:**

విద్యార్థులు విద్యా తో పాటుగా క్రీడల్లో రాణించాలని హైదరాబాద్ జిల్లా విద్యా అధికారి ( డిఐఈఓ ) డి.వడ్డేన్న సూచించారు. గత మూడు రోజులు గా సికింద్రాబాద్ వెస్లీ జూనియర్ కళాశాలలో హైదరాబాద్ జిల్లా గేమ్స్ పెడరేషన్ అండ్ వెస్లీ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్ 19 బాల ,బాలికల ఖో ఖో పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వడ్డేన్న పాల్గొన్న గెలుపొందిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఓడిన వారు లోటు పట్లు సవరించుకొని మళ్ళీ రాణించాలని క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జీవితంలో ఆరోగ్యమే మహా భాగ్యం అంటే అది కేవలం క్రీడాకారుల ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. అందుకే క్రీడలు జీవితంలో భాగం కావాలని సూచించారు. ఇదే ఉత్సహం తో రానున్న పరీక్షలో సత్తా చాటాలని , అత్యంత చాకచక్యంగా జీవితంలో రాణించాలని ,ఉన్నత శిఖరాలు అధిరోహించలని సూచించారు. క్రీడా నిర్వాహకులకు , పిఈటి లకు ధన్యవాదాలు తెలిపారు. 3 రోజులు క్రీడల నిర్వహణ కోసం గ్రౌండ్ ,వసతులు కల్పించిన వెస్లీ స్కూల్ వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.పి.యం.యోహాన్ , ఆర్గనైజింగ్ సేకరేటరీ పి.జక్కన్న , ఆర్గనైజర్స్ డా.నరసింహ యాదవ్, యాదయ్య గౌడ్, శివ రాజ్ , పూర్వ విద్యార్థి జాతీయ గోల్డ్ మెడలిస్టు బొగ్గరి.ఇమ్మనియల్ , ప్రో.సుబాన్ అల్లా , రవి , క్రీడాకారులు పాల్గొన్నారు..

బాలురల విభాగం లో మొదటి బహుమతి వరంగల్ జిల్లా , ద్వితీయ స్థానం హైదరాబాద్ ,మూడవ స్థానంలో రంగారెడ్డి జిల్లాలు గెలుపొందారు.

బాలికల విభాగంలో మొదటి స్థానంలో మహబూబ్ నగర్ , రెండవ స్థానంలో హైదరాబాద్, మూడవ స్థానంలో నల్లగొండ జిల్లాకు చెందిన వారు గెలుపొందారు.

మొదటి స్థానంలో నిలిచిన క్రీడాకారులు డిసెంబర్ నెలలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారని నిర్వాహకులు తెలిపారు.




# ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వాలు సమీక్షించుకోవాలి

- అన్ని వర్గాలను న్యాయం జరగాలి
- మాలల ఆత్మీయ సదస్సులో ఎమ్మెల్యే వివేక్

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

తాము అంబేద్కర్ ఆశయాలకు అనగుణంగా అన్నివర్గాలకు న్యాయం జరగాలని కోరుకుంటున్నామనీ , కులగణన జరిగిన తరువాతనే ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల అమలు జరగాలనేది తమ ప్రధాన డిమాండ్ అని , ఎన్ని ఎత్తులు వేసిన అబద్ధం నిజం కాదని వర్గీకరణ జరగనివ్వమని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లోని శాస్త్ర గార్డెన్ లో మాల మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం మాలల ఇబ్రహీంపట్నం ఐక్యవేదిక కన్వీనర్ మారయ్య, కోకన్వీనర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. ఏబిసిడి వర్గీకరణ రాజ్యాంగం బద్దంగా రావాలి, మనువాద వర్గీకరణ వద్దని అన్నారు. జాతి నిర్మాణం కోసం అన్ని వర్గాలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం అందరూ సైనికుల ఉద్యమించాలని అన్నారు. 30 లక్షల మాలల కోసం జరిగే జాతి పోరాటంలో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా సైనికుల ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మాల ఉద్యోగులను వేధిస్తే ఊరుకునేదని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఎలిమినేయర్ విధానాన్ని పునః సమీక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బుద్ధవనం ఓఎస్డి మల్లేపల్లి లక్ష్మయ్య , ప్రముఖ కార్డియాలజిస్ట్ ఎంఎఫ్ గోపీనాథ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సర్వయ్య, సమతా సైనిక్ దళ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దిగంబర్ కామ్లే, ఉద్యమకారుడు ప్రజా గాయకుడు రేంజర్ల షాన్ రాజేష్, మాల మహానాడు నాయకుడు చెన్నయ్య స్థానిక నాయకులుటి ఐక్యవేదిక కో కన్వీనర్లు,రాములు, భర్తకి జగన్, హనుమన్ల కిష్టయ్య, ఆవుల మల్లేష్, చిలకల బుగ్గ రాములు, శ్రావణ్ , డాక్టర్ అబ్బయ్య,నంది వనపర్తి జై భీమ్ యూత్ అధ్యక్షుడు మరాఠీ వివేక్ పాల్గొన్నారు.

# ఉద్యమకారుల డిమాండ్లు పరిష్కరించాలి

**తుర్కయంజాల్, విశాలభారతి:**



ఉద్యమకారులకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని కేంద్రమంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి ఆధ్వర్యంలో బండి సంజయ్‌ని పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం వీరోచితంగా పోరాడిన నాయకులను ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బొక్క నర్సింహారెడ్డి, బోసుపల్లి ప్రతాప్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్, నాయకులు తూళ్ల నర్సింహ గౌడ్, ఉద్యమకారులు పి.బాలయ్యగౌడ్, కె.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన బిడ్డకు లకావత్ సరోజకు డాక్టరేట్

**విశాలభారతి,సికింద్రాబాద్:**



ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీతాఫల్ మండి,హైదరాబాద్ లో కామర్స్ అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్న లకావత్ సరోజకు ద్రావిడియన్ యూనివర్సిటీ డాక్టరేట్ ను ప్రకటించింది. సరోజ 'ఫైనాన్షియల్ ఫర్ఫామెన్స్ ఆఫ్ న్యూ ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్స్ ఇన్ ఇండియా ఏ కంపారిటివ్ స్టడి' అనే అంశంలో పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినందుకుగాను ఈ డాక్టరెట్ ను ప్రకటించారు.ఈ పరిశోధనకు పర్యవేక్షకులుగా (గైడ్ ) , ప్రస్తుతానికి ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. గడ్డం నరేష్ రెడ్డి వ్యవహరించారు. తాను పీహెచ్డీ చేయడానికి భర్త బి. శంకర్ ఎంతగానో ప్రోత్సహించారని సరోజ అన్నారు.ఒకపక్క బోధన నిర్వర్తిస్తు మరోపక్క ఇంటి బాధ్యతలు నెరవేరుస్తూ పిహెచ్డి పూర్తిచేసిన తమ తల్లి కృషి ఎంతో స్ఫూర్తినిచ్చిందని సరోజ పిల్లలు, శరద్ చంద్ర, నందితలు హర్షం వ్యక్తం చేశారు. సరోజకు కామర్స్ లో డాక్టరేట్ రావడం పట్ల సీతాఫల్ మండి ప్రభుత్వ డిగ్రీ) కళాశాల ప్రిన్సిపాల్ డా. రామచంద్రం అభినందనలు తెలియశారు.తమతోటి అధ్యాపకురాలికి డాక్టరేట్ రావడం పట్ల కళాశాల అధ్యాపక బృందం మరియు విద్యార్దులు శుభాకాంక్షలు తెలియజేశారు.



# మహిళలకు కాంగ్రెస్ పార్టీలో పెద్దపీట

- గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి దినేష్ కుమార్
- కల్వ సుజాత గారికి చైర్మన్ పదవి ఇవ్వడం హర్షనీయం
- గంధం రాజు

**విశాలభారతి,కూకట్పల్లి:**

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ ఆర్యవైశ్య కార్పొరేషన్ కార్యాలయ ప్రారంభోత్సవానికి కూకట్పల్లి నియోజకవర్గం నుంచి కొప్పిశెట్టి దినేష్ కుమార్,గంధం రాజు ఆధ్వర్యంలో వందల సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళ నాయకురాలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కాల్వ సుజాత ని కొప్పిశెట్టి ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా దినేష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ను ఏర్పాటు చేయడం కల్వ సుజాత ను చైర్మన్గా నియమించిన రేవంత్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, ప్రజా సేవలో ఎల్లప్పుడూ తన వంతు కృషి చేసి కాంగ్రెస్ పార్టీలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్న కల్వ సుజాత కి చైర్మన్ పదవి రావడం సంతోషకరమని, మహిళలను ఆదరించి గౌరవించే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈకార్యక్రమంలోకార్యక్రమంలో గంట శ్రీనివాస్ గౌడ్ ,రాజేష్ యాదవ్, సుబ్బు నాయుడు, దార్ల వనజ, రమేష్ నాయక్ , శివ, సూరి, సరోజ వీణ, దుర్గ, సుజాత ,వాణి ,రోజా తదితరులు పాల్గొన్నారు.




# ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాలి

- జలమండలి మేనేజర్ ఎం.డి. అమీరుద్దీన్
- ఇంకుడు గుంత ఏర్పాట్లపై అవగాహన కార్యక్రమం

**విశాలభారతి,కూకట్పల్లి :**

నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, వర్షాకాలంలో పడిన ప్రతీ నీటి చుక్కను వృథా పోనియకుండా భూమిలో ఇంకే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని కూకట్‌పల్లి సెక్షన్ జలమండలి మేనేజర్ ఎం.డి. అమీరుద్దీన్ అన్నారు. శనివారం జలమండలి అధికారుల సూచనల మేరకు కూకట్‌పల్లి సెక్షన్ పరిధిలోని డివిజన్ 9 లోని సబ్ డివిజన్ 1 లోని పలు కాలనీలలో భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా గాంధీకి చెందిన స్వచ్ఛంద సంస్థలు సహకారంతో అవగాహన కార్యక్రమాని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వర్షపు నీటిని భూమిలో ఇంకే విధంగా చూడాలని అన్నారు. దీని కోసం ప్రతి ఇంటిపై పడిన వర్షపు నీరు భూమిలో ఇంకే విధంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసు కోవాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్జీవో సుభాష్, జలమండలి ఉద్యోగులు రవీందర్ రెడ్డి, కుమార్, చింటూ, దుర్గేష్, పాషా తదితరులు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన స్కైలాబ్ నాయక్

**అడవిదేవులపల్లి, విశాలభారతి:**

గ్రామానికి చెందిన గొడుగు కొండలు అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ధీరావత్ స్కైలాబ్ నాయక్ పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట మండల కాంగ్రెస్ నాయకులు బండి నాగేశ్వరరావు, పెద్దింటి రామ్మూర్తి, బండి నరసింహారావు ,గొడుగు హనుమయ్య, శేఖర్ తదితరులు ఉన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక



## cinema updates



## మట్కా లో వాసు క్యారెక్టర్ తో ఆడియన్స్ డెఫినెట్ గా కనెక్ట్ అవుతారు

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, SRT ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి హై బడ్జెట్ తో నిర్మించారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఈ మూవీ టీజర్, ట్రైలర్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జివి ప్రకాష్ కుమార్ కంపోజ్ చేసిన మట్కా ఆల్బమ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'మట్కా' నవంబర్ 14న ప్రేక్షకులు ముందుకు రానుంది. ఈ సందర్భంగా మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు. వాసు అనే అబ్బాయి కథే మట్కా. తను బర్మా నుంచి శరణార్థి గా వైజాగ్ వస్తాడు. 1958 నుంచి 82 వరకు తను అంచెలంచెలుగా ఎలా ఎదిగాడు అనేది చూపిస్తాం. వాసు అనే అబ్బాయి లైఫ్ స్టోరీ ఇది. డైరెక్టర్ గారు ఈ కథని తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా చేద్దామని భావించారు. రతన్ ఖత్రి ది ముంబై నేపథ్యం. తను పాకిస్తాన్ నుంచి ముంబై వచ్చారు. పైగా ఆయన చేసిన పనులను జనాలు రూమర్స్ లా మాట్లాడుకోవడమే తప్పితే కొన్నిటికి ఆధారాలు లేవు. సెల్ ఫోన్స్ లేని రోజుల్లో దేశం మొత్తం ఒకే నెంబర్ ని ఒకే రోజు పంపించడాని చెప్తుంటారు. తను ఎలా పంపించాడో ఎవరికీ తెలియదు. మా డైరెక్టర్ గారు ఒకవేళ తనే మట్కా కింగ్ అయి ఉంటే తను ఎలా చేసేవారో అని ఆలోచించి ఆయనకు వచ్చిన ఐడియాస్ తో వాసు క్యారెక్టర్ ని డిజైన్ చేశారు. మేజర్ హోంవర్క్ అంటే డైరెక్టర్ గారితో చాలా టైం స్పెండ్ చేశాను. చాలాసార్లు స్క్రిప్ట్ చదివాను. క్యారెక్టర్ లోకి తీసుకురావడానికి అది చాలా హెల్ప్ చేస్తుంది. చదువుతున్నప్పడే వాసు క్యారెక్టర్ ఎలా ఉంటుందో ఒక అంచనాకొస్తాం. దానితో ఒక స్ట్రక్చర్ బిల్డ్ అవుతుంది. తను ఎలా కూర్చుంటాడు? ఎలా నడుస్తాడు? ఎలా సిగరెట్ కాలుస్తాడు? ఇవన్నీ ఒక చదువుతున్నప్పడే ఐడియా వచ్చేస్తుంది. ఇక ఉత్తరాంధ్ర యాస విషయానికి వస్తే వాసు బర్మా నుంచి వస్తాడు కాబట్టి తను ఆ యాస మాట్లాడాల్సిన అవసరం బిగినింగ్ లోనే ఉండదు. ఆ క్యారెక్టర్ జర్నీ జరుగుతున్న కొద్దీ అక్కడ యాస పడుతుంది. తన ఏజ్ పెరిగిన కొద్దీ తన క్యారెక్టర్ తో పాటు బ్యాడీ లాంగ్వేజ్, యాస పాలిష్ అవుతుంది. మట్కా ప్రొడక్షన్ డిజైన్ కూడా చాలా అద్భుతంగా ఉంటుంది. షూటింగ్ లొకేషన్లో అవతలి యాక్టర్ తో కూర్చుని మాట్లాడుతున్నప్పడు ఆయన ఇచ్చిన రెస్పాన్స్ కూడా హెల్ప్ అయ్యింది. సినిమా కోసం స్క్రిప్ట్ రీడింగ్ సెషన్స్ కూడా చేశాం. మట్కా సందేశాత్మక చిత్రం కాదు. ఇది ప్రాపర్ కమర్షియల్ మాస్ ఫిలిం. వాసు క్యారెక్టర్ లో తనకి ఎవడూ హెల్ప్ చేయడనే ఒక బాధ, కోపం కనిపిస్తుంది. వాసు క్యారెక్టర్ తో ట్రావెల్ చేస్తున్న కొద్దీ తను చెప్పేది కొన్నిసార్లు నిజం అనిపిస్తుంది. కొన్నిసార్లు పాపమనిపిస్తుం. కొన్నిసార్లు ఆ క్యారెక్టర్ మీద కోపం కూడా వస్తుంది. ప్రతి ఈ మనిషిలో ఐదేళ్ల కు ఒకసారి తన వ్యక్తిత్వం ఎక్కడో చోట మారుతూ ఉంటుంది. వాసు క్యారెక్టర్ లో ఇవన్నీ కనిపిస్తాయి. ఈ దేశంలో చెలామణి అయ్యే ప్రతీ రూపాయిలో 90 పైసలు ఒక్కడే సంపాదిస్తాడు. మిగతా 10 పైసల గురించి 99 మంది కొట్టుకుంటారు. వాసు ఆ ఒక్క పెర్సెంట్ లో వుండాలనుకుంటాడు. ఇది కాన్సెప్ట్ అఫ్ ది ఫిల్మ్.

## అరకులో 'సంక్రాంతికి వస్తున్నాం' ఫైనల్ షెడ్యూల్



విక్టరీ వెంకటేష్, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అద్భుతమైన హ్యాట్రిక్ కొలాబరేషన్ తర్వాత మోస్ట్ ఎవైటెడ్ 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీ చాలా క్యురియాసిటీని క్రియేట్ చేస్తోంది. ఈ డైనమిక్ కాంబినేషన్ ఇప్పటికే రెండు పెద్ద హిట్‌లను అందించింది. బ్లాక్‌బస్టర్‌లను అందించడంలో అనిల్ రావిపూడి ది స్పెషల్ రికార్డ్. అప్ కమింగ్ మూవీ ఫుల్ ఫ్లెడ్జ్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని హామీ ఇవ్వడంతో పాటు, యూనిక్ ట్రైయాంగిలర్ క్రైమ్ నెరేటివ్ ని అందిస్తుంది. రీసెంట్ గా రిలీజైన 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్ పోస్టర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఈ రోజు ఫైనల్ షెడ్యూల్ అరకులో ప్రారంభమైయింది. మేకర్స్ రిలీజ్ చేసి వీడియోలో స్కూల్ స్టూడెంట్స్ హీరో వెంకటేష్ గారికి సాదరంగా స్వాగతం పలకడం, ఆయన ఆప్యాయంగా పలకరించడం అందరినీ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

## సూర్య 'కంగువా'లో పాట పాడిన శ్రద్ధా దాస్

నటిగా శ్రద్ధా దాస్‌కి మంచి పేరు ఉంది. ఇక ఇప్పుడు ఆమె ప్రొఫెషనల్ ప్లేబ్యాక్ సింగర్‌గా మారిపోయారు. ఇప్పుడు ఆమెను గాయనిగా ప్రేక్షకులకు దేవీ శ్రీ ప్రసాద్ పరిచయం చేస్తున్నారు. సూర్య నటించిన పాన్ ఇండియా చిత్రం కంగువాలో శ్రద్ధా దాస్ ఓ పెప్పీ సాంగ్‌ను ఆలపించారు. సూర్య, దిశా పటాని, బాబీ డియోల్ వంటి భారీ తారాగణంతో తెరకెక్కించిన ఈ చిత్రం నవంబర్ 14న రిలీజ్ కాబోతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కంగువా చిత్రంపై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. కంగువా నుంచి వచ్చిన యోలో పాట అందరినీ అలరించింది. యూట్యూబ్‌లో ఇప్పటికే మిలియన్ల వ్యూస్ సాధించింది. దేవి శ్రీ ప్రసాద్, శ్రద్ధా దాస్, సాగర్ గాత్రం ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాకేందు మౌళి సాహిత్యం అందరినీ ఆకట్టుకుంది. యోలో పాటలోని శ్రద్ధా దాస్ గాత్రం అందరినీ ఆకట్టుకుంటోంది. ఇదిలా ఉంటే, ఇటీవల హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగిన మ్యూజికల్ ఈవెంట్‌లో రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్‌తో కలిసి శ్రద్ధాదాస్ పాటలను పాడి ప్రేక్షకులను ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.



## "ధూం ధాం"కు ప్రేక్షకుల నుంచి ఎక్స్ లెంట్ రెస్పాన్స్ వస్తోంది

**సక్సెస్ మీట్ లో హీరో చేతన్ కృష్ణ**



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "ధూం ధాం". సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. "ధూం ధాం" సినిమాను లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా దర్శకుడు సాయి కిషోర్ మచ్చా రూపొందిస్తున్నారు. గోపీ మోహన్ స్టోరీ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ నెల 8వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వచ్చిన ఈ సినిమా సకుటుంబంగా ప్రేక్షకుల్ని ఎంటర్ టైన్ చేస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర సక్సెస్ మీట్ ను హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపీ మోహన్ మాట్లాడుతూ మా "ధూం ధాం" సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. యూఎస్ నుంచి కూడా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. మంచి సినిమా చేశామని ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ సినిమాను మీడియా మిత్రులు మరింతగా ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నా. థియేటర్స్ కు వస్తే తప్పకుండా ప్రతి ఒక్కరూ ఎంటర్ టైన్ అవుతారు. అన్నారు. దర్శకుడు సాయికిషోర్ మచ్చా మాట్లాడుతూ "ధూం ధాం" సినిమా ఫ్యామిలీ ఎంటర్ టైనర్ అనే పేరు వస్తోంది. ఈ సినిమాకు పనిచేసే అవకాశం మా గోపీ మోహన్ గారి వల్ల వచ్చింది. "ధూం ధాం" సినిమా రిలీజైన ప్రతి సెంటర్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. నాకు కనీసం వంద ఫోన్ కాల్స్ వచ్చి ఉంటాయి. ఈ సినిమాలో వెన్నెల కిషోర్, బెనర్జీ, సాయి శ్రీనివాస్ వంటి వారి క్యారెక్టర్స్ చూస్తూ ప్రేక్షకులు బాగా నవ్వుతున్నారు. మా మూవీని మీడియా ఫ్రెండ్స్ మరింతగా ఆడియెన్స్ కు రీచ్ చేయాలి. అన్నారు. నిర్మాత రామ్ కుమార్ మాట్లాడుతూ పెద్ద సినిమాల పోటీలో "ధూం ధాం" లాంటి చిన్న సినిమా నిలదొక్కుకోవడమే గొప్ప విషయం. మేము ఇంకా పరుగు స్టార్ట్ చేయలేదు. నిలబడ్డాం అంతే. మా మూవీని ఆడియెన్స్ దాకా రీచ్ చేసిన క్రెడిట్ మీడియా మిత్రులదే. తర్వాత ఓటీటీలో చూద్దాంలే అని అనుకోకుండా "ధూం ధాం" సినిమాను థియేటర్ లో ఎక్స్‌పీరియన్స్ చేయండి. ఎందుకంటే ఇలాంటి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ సినిమాను 2, 3 వందల మంది ప్రేక్షకుల మధ్య కూర్చొని చూస్తే బాగా ఎంజాయ్ చేస్తారు. అన్నారు. హీరో చేతన్ కృష్ణ మాట్లాడుతూ మా "ధూం ధాం" సినిమాకు ప్రేక్షకుల దగ్గర నుంచి ఎక్సలెంట్ రెస్పాన్స్ వస్తోంది. మీడియా నుంచి కూడా చాలా మంచి రివ్యూస్ వచ్చాయి. నిన్న (ఫ్రైడే) మార్నింగ్ నుంచి రాత్రి వరకు ప్రతి షోకు థియేటర్స్ లో ఫుట్ ఫాల్స్ పెరిగాయి. సినిమా చాలా బాగుందంటే తప్ప ఆడియెన్స్ బయటకు రాని ఈ ట్రెండ్ లో మా మూవీకి 70, 80 పర్సెంట్ హౌస్ ఫుల్స్ కావడం సంతోషంగా ఉంది. సినిమాలో కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్ ఉంటుందని మేము ముందునుంచీ చెబుతూ వస్తున్నాం. ఆ ఎంటర్ టైన్ మెంట్ కే ఆడియెన్స్ కనెక్ట్ అవుతున్నారు. సినిమా చూసి తమ రెస్పాన్స్ చెబుతున్న ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. చూడని వాళ్లు థియేటర్స్ లో "ధూం ధాం" చూడమని రిక్వెస్ట్ చేస్తున్నా. అన్నారు.

## మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ #SDT18 ఇంటెన్స్ రోల్ లో శ్రీకాంత్



మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ 'విరూపాక్ష', 'బ్రో' బ్లాక్‌బస్టర్ విజయాల తర్వాత, తన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ #SDT18 చేస్తున్నారు. డెబ్యూటెంట్ రోహిత్ కెపి ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. హనుమాన్ సెన్సేషనల్ పాన్ ఇండియా విజయం తర్వాత నిర్మాతలు కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పై ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను హై బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. మేకర్స్ లేటెస్ట్ గా మరో క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ఈ మూవీలో పవర్ హౌస్ పెర్ఫార్మర్ శ్రీకాంత్ క్రూషియల్ రోల్ పోషిస్తున్నారు. ఇంటెన్స్ లుక్ లో ప్రెజంట్ చేసిన శ్రీకాంత్ ఇంట్రో పోస్టర్ క్యూరియాసిటీ పెంచింది. ఇటీవలే రిలీజ్ చేసిన "ఇంట్రూడ్ ఇన్‌టు ది వరల్డ్ ఆఫ్ ఆర్కాడీ" వీడియోకి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఓ అద్భుతమైన ప్రపంచాన్ని క్రియేట్ చేయడంలో ప్రొడక్షన్ టీమ్ డెడికేషన్ ని ఈ వీడియో ప్రజెంట్ చేసింది.



## 'త్రిబాణధారి బార్బరిక్' నుంచి ఉదయ భాను కారెక్టర్ పోస్టర్

భీముడు మనవడు, ఘటోత్కచుడు కుమారుడు బార్బరిక్ (బార్బరికుడు) పాత్రను ఆధారంగా తీసుకుని 'త్రిబాణధారి బార్బరిక్' అనే చిత్రం రాబోతోంది. స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పకుడిగా విజయపాల్ రెడ్డి ఆదిధాల నిర్మించిన ఈ మూవీకి మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. వానర సెల్యూలాయిడ్ బ్యానర్ మీద తెరకెక్కించిన ఈ చిత్రానికి సంబంధించిన మోషన్ పోస్టర్‌ను తాజాగా రిలీజ్ చేయడంతో ఒక్కసారిగా అంచనాలు పెరిగాయి. తాజాగా ఈ మూవీ నుంచి మరో అప్డేట్ వదిలారు. ఉదయ భాను పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి మరింత హైప్ పెంచేశారు. వాకిలి పద్మ అనే పాత్రను ఉదయ భాను పోషించారు. ఇక ఆమె పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను చూస్తుంటే.. ఆ స్వాగ్, యాటిట్యూడ్, కుర్చీలో కూర్చున్న తీరు అన్నీ కూడా కొత్తగా ఉన్నాయి. చాలా ఏళ్ల తరువాత ఉదయ భానుకి మంచి పాత్ర పడ్డట్టుగా కనిపిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో చిత్రయూనిట్ బిజీగా ఉంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. ఇకపై ఇలానే సర్ ప్రైజింగ్ అప్డేట్లతో ఆడియెన్స్‌ను చిత్రయూనిట్ అలరించనుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.